ప్రాచీనగాథాలహరి

# పరమ శివార్చన

౧

కాశ్మీరామాత్యుడు శూరమంత్రి భవంతి ప్రాంగణంలో వందిమాగధుల కైవారాలు ప్రభాత మంగళతూర్యాల తీరులలో ఘోరుమని మారుమోగాయి.

శూరమంత్రి వందిమాగధులలో ప్రధాన వంది కృతమందారుడు. మంత్రి ప్రాతఃకాల వేళ తన పరమశివార్చన యావత్తు యథావిధిగా ముగించుకొని కొలువు కూటానికి బయలుదేరి వెళ్లే వేళలో అనుదినము కృతమందారుడొక హెచ్చరిక చేస్తూ ఉంటాడు. ఈనాడుకూడా అతడలాగే ఆ హెచ్చరిక చేశాడు. అది శ్లోక రూపంలో ప్రతిధ్వనించే హెచ్చరిక :

"అయమవసర ఉపకర్తుం
ప్రకృతిచపలా యావదస్తి సంపదియమ్
విపది సదాభ్యుదయిన్యాం
పునరుపకర్తుం కుతోవసరః"

"ఈ ఐశ్వర్యం స్వభావతః చంచలమైనది. ఇది చేతనున్నప్పుడే ఇంకొకరికి ఉపకారం చెయ్యాలి. ఆపత్తులెల్లవేళలా మీదిమీదికి విరుచుకుపడుతూనే ఉంటాయి! కనక ఈ క్షణంలోనే ఇంకొకరికి ఉపకారం చెయ్యాలి! దానికిదే తగినక్షణం!"

అదీ ఆ శ్లోక తాత్పర్యం!

ఆ హెచ్చరిక వినగానే, శూరమంత్రి హృదయం ఆనందంతో పరవళ్లు తొక్కి పులకరించింది. ప్రధానవంది కృతమందారుని పై ఒకమారు చూచి చిరునవ్వు నవ్వి శూరమంత్రి వెంటనే తన కొలువు కూటానికి వెళ్లిపోయాడు.

ధర్మాసనంమీద కూర్చున్న తరవాత కొంత సేపటివరకు శూరమంత్రి హృదయంలో ఆ శ్లోకార్థమే ప్రతిధ్వనించింది.





అది ఆత్మదఘ్నంగా ఆకళించుకొన్న మంత్రికి తన ధర్మనిర్వహణలోను, కులదైవతమైన పరమశివుని పాదపద్మార్చనలోను కొంతవరకు సంతృప్తి కలిగింది.

మంత్రి ఆక్షణంలో తాను చాలావరకు ధన్యజీవినే అని అనుకొన్నాడు. అది యథార్థమే.

కాశ్మీరాధీశ్వరుడు అవంతివర్మ రాజ్యానికి వచ్చినప్పటినించీ కాశ్మీర ప్రజ అతని ధర్మతత్పరతకెంతో ఆనందించారు.

అవంతివర్మ ఎంతో ప్రయత్నంచేసి ఏరికోరి శూరమంత్రికి ప్రధానామాత్యాధికారం అప్పగించాడు. ఆ క్షణంనించీ మంత్రి తన సేవాతత్పరతతో అవంతివర్మ హృదయం చూరగొన్నాడు. కాశ్మీర దేశంలో అంతటి అన్యోన్యతకలిగిన రాజమంత్రుల నింతవరకెన్నడు కని విని ఎరగమని ఆ దేశ ప్రజ వారి పరస్పర సౌహార్దం అనేకవిధాల ప్రస్తుతించారు.

రాజమంత్రులిద్దరు ఒకరొకరిని బావమరదుల వరసలో పలకరించుకొనేవారు. ఒకరిమాట ఇంకొకరెన్నడు జవదాటలేదు. కొంతకాలానికి వారిద్దరిలోను రాజ మంత్రులెవరో నిర్ణయించడమే కష్టమై పోయింది! వారి అన్యోన్యతావధి అంతవరకు వెళ్ళిపోయింది!

అవంతివర్మ రాజ్యానికి వచ్చే సరికి కాశ్మీర దేశంలో షట్శాస్త్రాల పఠన పాఠాలు బాగా సన్నగిల్లిపోయాయి. రాజమంత్రులిద్దరు కలిసి వారాణసి, ఉజ్జయిని మొదలైన నగరాలనుండి ఆయా శాస్త్ర విద్వాంసులెందరెందరినో శ్రీనగరానికి పిలిపించి తమ దేశంలో తిరిగీ ఆయా శాస్త్ర సంప్రదాయా లనూచానంగా వెలయింపజేశారు.

ముక్తాకణకవి, శివస్వామి, రత్నాకరుడు, అలంకారశాస్త్ర ప్రవర్తకుడు, ఆనందవర్ధనుడు ఆ కాలంలో కాశ్మీరంలో మిను మిగిలిన విద్వత్కవులు. వారందరిని ఆ రాజమంత్రులిద్దరు తమ ఆస్థాన విద్వత్కవులుగా నియమించి వేవిధాల గౌరవించారు.

అవంతివర్మ ఆస్థాన విద్వాంసులందరు మహా రాజోచిత మర్యాదలతో గజాశ్వాందోళికాదివాహనాలలో రాజాస్థానానికి విచ్చేసేవారు! అపూర్వమైన అవంతివర్మ విద్వద్గౌరవం కళ్లారాచూచిన కాశ్మీర ప్రజ పూర్వం మేఘవాహననృపతి ధర్మపరిపాలనలో ఇలాంటి విద్వద్గౌరవమే జరిగేదని అత్యాశ్చర్యంగా చెప్పుకునేవారు!

శూరమంత్రి ప్రత్యేకంగా తన పేరట కాశ్మీరంలో శూరాగ్రహారం నిర్మింపజేసి అక్కడ శూరేశ్వర శివాలయప్రతిష్ఠ చేశాడు.

కాశ్మీరాధిపతి అవంతివర్మ అంతకన్నా మహా వితరణశాలి అనీ పరమశివార్చనాపరుడనీ ప్రఖ్యాతి సంపాదించాడు.

# పరమ శివార్చన

"లక్ష్మీదేవి దేవవేశ్యలయిన అప్సరసల సరసనే జన్మించింది. కనకనే ఆ దేవత కంతటి చాంచల్యం సంక్రమించింది. ఉత్తర క్షణంలో ఈ ఐశ్వర్యాన్ని కేమిరానున్నదో ఎవరు చెప్పగలరు?"

అని అవంతివర్మ తన అపార సంపదైశ్వర్యాలన్నీ దానధర్మాల కిందే వ్యయం చేసేవాడు. అవంతివర్మ వంశీయులయిన కాశ్మీర రాజన్యులందరు నిత్య శివార్చనా నిరతులు. అయితే అవంతివర్మకు చిన్ననాట కొంచెం విష్ణుభక్తి కుదిరింది. కాని శూరమంత్రితో సౌహార్దభాగ్యం లభించినప్పటి నించీ అతడు త్రికరణశుద్ధిగా పరమ మాహేశ్వరుడైనాడు.

శూరమంత్రి సౌహార్దమే దానికి కారణమనీ ఆ మంత్రియెడల ఆయనకు కలిగిన ఆదరాభిమానా లటువంటివనీ రాజబంధువులు కొందరు తమలోతాము గుసగుసలాడుకోక పోలేదు. ఏది ఏమైనా ఆ రోజుల్లో కాశ్మీరంలో శైవ దేవాలయప్రతిష్ఠ లసంఖ్యాకంగా పెరిగిపోయాయి. అనేక జీర్ణ శైవ దేవాలయాల పునరుద్ధరణం జరిగింది. అటువంటి ధర్మమూర్తి అవంతివర్మ దగ్గర తన కమాత్యాధికారం లభించడం కేవలం తన పూర్వజన్మ పుణ్యవిశేషంవల్లనే జరిగిందని శూరమంత్రి అనుక్షణము ఉబ్బి తబ్బిబ్బై పోయేవాడు.

అయితే శూరమంత్రి జీవితాని కంతటికీ ఒకేఒక మనోవ్యాధి పట్టుకుని పీడించింది. అతనికి ప్రథమ కళత్రంవల్ల కలిగిన కుమారుడిప్పటికి బాగా చేతి కందివచ్చాడు.

అతనిపేరు రత్నవర్ధనుడు. తండ్రి కన్ని విధాలా అనువర్తనగానే నడుచుకుంటున్నాడు.

ప్రథమ కళత్రం పోయేసరికిం కా అతను నడివయస్సులోనే ఉన్నాడు. ఆపైన బంధువులంతా నిర్బంధించడంవల్ల అతనికిక తిరిగీ వివాహం చేసుకోక తప్పలేదు. ద్వితీయ కళత్రాని కెంతకాలానికీ సంతతి కలగలేదు. మరికొంతకాలాని కామె ఆ ఆశ నిరాశ చేసుకొని ఒక పసివాణ్ణి దగ్గిరికి తీసుకుంది. వాడి కెంతో ముద్దుగా పినాకధన్వా అని పేరు పెట్టుకుంది. ఆమె శివభక్తిలో భర్తకన్న మిన్న అని పేరుకెక్కింది. కనకనే తన దత్తపుత్రుని కాపరమేశ్వరుని పేరే పెట్టుకుంది. కాని ముద్దుగా ఆ పసివాణ్ణి 'ధన్వా' అని పిలిచేది.

క్రమంగా వాడు పెరిగి పెద్దవాడైనాడు. మహాభక్తులకు, పరమనాస్తికులు, అపార విత రణమూర్తులకు పరమలోభులు, దిద్దంతుల వంటి విద్వాంసులకు పరమమూర్ఖులు పుత్రులుగా ఉదయించడం ఈసృష్టి అత్యద్భుతాలలో ఒక పరమాద్భుతం! దానికి వ్యాస మహర్షి శాపంకూడా కొంచెం తోడుపడిందేమో!

ఏదిఏమైనా పినాకధన్వ పెరిగి పెద్దవాడై తండ్రి శూరమంత్రి కొక దారుణ హృదయశూలంగా పరిణమించాడు. అతగాడి కెంత చదివించినా ఒక్క అక్షరం ముక్కకూడా అంటలేదు! తల్లిదండ్రులు లేది చెప్పినా ఆక్షణంలో తలఊపి ఉత్తర క్షణంలో అది అతిక్రమించడమే అతనికొక పరిపాటి!

కాని తల్లిదండ్రుల కిష్టంలేని సాము గరిడీలలోను, మల్లవిద్యలలోను, దుస్సహసాలలోను అతనికి బాగా ఆస్థ కలిగింది. కఠినంగా శిక్షిస్తే మరింత రెచ్చిపోతాడేమో ననే భయంకొద్దీ తల్లిదండ్రులిద్దరు కొంతకాలంవరకు అతని ధోరణి చూసీ చూడనట్టు మాట్లాడకూరుకున్నారు. కాని క్రమక్రమంగా అతని అవినయధోరణి బాగా రెచ్చిపోయింది. అంతేగాని అదిఏమాత్రము తగ్గలేదు. అయినా పరమేశ్వర కృపవల్ల అతడెప్పటికైనా దారిని పడకపోతాడా అని వారిద్దరు అలాగే దేవతలకు మొక్కులు మొక్కుకుంటూ కొంతకాలంపాటూరుకున్నారు.

శూరమంత్రికి ధర్మాసనంమీద సుఖంగా కూర్చున్న క్షణంలో అదంతా ఒక మెరుపులా స్ఫురణకు వచ్చింది. అతడొక నిట్టూర్పువిడిచి తిరిగి తవ దైనందిన రాజకార్య పర్యవేక్షణలో పడ్డాడు.

## ౨

అప్పటికి హేమంత ప్రాతఃకాల సూర్య కిరణా లతని సువర్ణ ధర్మపింహాసనంపై ప్రసరించి బంగారు హారతులెత్తాయి. అంతవరకు శూరమంత్రిఏవేవో రాజ్యవ్యవహారాలు పరిశీలిస్తూ తలవంచుకుని కూర్చున్నాడు. అందుచేత ధర్మనిర్ణేతలైన ప్రాడ్వివాకు లెవరు అతని సన్నిధికి రావడానికి సాహసించలేదు. మంత్రి కిరువైపులా ఇద్దరు పరిచారకు లనుక్షణము మంత్రి ఆజ్ఞకోసం ఎంతోఆత్రంగా నిరీక్షిస్తూ నిలుచున్నారు.

శూరమంత్రి తన రాజకార్య పర్యవేక్షణము గించాడు. అతని కెదురుగా అనతిదూరంలో కాశ్మీరంలో సుప్రసిద్ధమైన విజయేశ్వర, త్రిపురేశ్వర, భూతేశ్వర శైవదేవాలయాల సువర్ణకలశాలు, అప్పుడే వికసించిన బంగారు తామర పూవుల్లా తళతళామెరుస్తూ ప్రత్యక్షమైనాయి. శూరమంత్రి ఆ ముగ్గురు దేవతలను మనసారా సంస్మరించుకొని వారికి మనస్సులోనే సవినయంగా నమస్కారం చేశాడు.

అంతలో ఒక ప్రాడ్వివాకుడు సవినయంగా లేచినిలబడి శివద్రవ్యం అపహరించిన ఇద్దరు అపరాధుల ఘోరాపరాధాలు పరిశీలించి వారికి సముచితమైన రాజదండనం విధించవలిసిందని విజ్ఞప్తిచేశాడు.

ఆనాడు కాశ్మీర రాజ్యంలో సామాన్యాపరాధుల అపరాధాలన్నీ ధర్మాధికారులైన ప్రాడ్వివాకులే పరిశీలించి తగిన దండనలు విధించేవారు. కాశ్మీరదేశంలో దేవాలయాల ద్రవ్యం అపహరించినవారిని నిర్దాక్షిణ్యంగా శిక్షిస్తారు. అందులోను శివద్రవ్యం అపహరించినవారికి కేవలం దారుణ మరణదండనం తప్ప మరి వేరే దండనమేమీ లేదు. అందుచేత ప్రాడ్వివాకు లా వ్యవహారాలు మహామాత్యునికే విన్నవిస్తారు. ఆపైన మహామాత్యుడే వారికి తగిన శిక్షలు విధిస్తాడు.

ఆ ప్రాడ్వివాకుడా ఇద్దరు అపరాధుల ఘోరాపరాధాలు సాక్ష్య పరిశీలనద్వారా నిస్సందేహంగా ఋజువైనాయని విన్నవించి ఆ వ్యవహారానికి సంబంధించిన కవిలెకట్టలు, భూర్జపత్రాలు అన్నీ శూరమంత్రి ముందుంచాడు.

శూరమంత్రి ఆపత్రాలన్నీ పరిశీలించాడు. తిరిగీ దూరదూరంగా నిలుచున్న ఆ అపరాధుల నిద్దరినీ బాగా నిశితంగా పరిశీలించాడు. వారిద్దరి ముఖాలు అప్పుడే భయంకర మృత్యుభీతితో బాగా వెలవెలబోయాయి. వారి కనతిదూరంలో నిలబడిన ఆ అభాగ్యుల బంధుమిత్రులు వారి ప్రాణాలమీద నిరాశ చేసుకుని నిశ్శబ్దంగా కుమిలికుమిలి దుఃఖిస్తున్నారు.

వారిలో మొదటి అపరాధి బందిపోటు దొంగతనాలలో బాగా అందెవేసిన చెయ్యి. అతడింతకుపూర్వం అలాంటి అపరాధాలెన్నెన్నో చేసి కఠిన కారాగారవాసమే నిజనివాసం చేసుకొన్నాడు. ఆ దొంగల నాయకుడు విజయేశ్వరస్వామి మడిమాన్యాలలో పడి యథేచ్ఛగా బందిపోటు దొంగతనం సాగించాడు. ఆ అభాగ్యుణ్ణి మదించిన ఏనుగు కాలికింద మట్టించి చంపివెయ్యవలసిందని మంత్రి కఠినంగా ఆజ్ఞాపించాడు.

ఇక రెండవ అపరాధిమాట. అతగాడింకా దొంగతనాలలో బాగా ఆరితేర లేదు. కాని అతగాడి ధోరణి చూస్తేనే గర్భ దరిద్రుడుల్లా కనిపిస్తున్నాడు. అతడు శూరమంత్రి వంశీయుల ఇష్ట దైవతమైన భూతేశ్వరస్వామి ఆలయంలోజొరబడి అమ్మవారి ముక్కెర కాజేశాడు. రాజాధికారు లాముక్కెర అతని పూరి గుడిసెలో వెదికి పట్టుకున్నారు.

ఆ అపరాధిని చూడగానే మంత్రి

హృదయంలో కొంచెం ఆర్ద్రత పొడచూపక పోలేదు. కాని ఆదొంగ చేసిన అపరాధం అక్షంతవ్యం! మంత్రి మాత్ర మేమి చెయ్యగలడు! మెడకొక బండరాయి కట్టి వెంటనే వితస్తానదిలో పడవేయవలసిందని కఠినంగా శిక్ష విధించాడు. వెంటనే తన ధర్మాసనం విడిచి కిందికి దిగివచ్చాడు.

ఆసమయంలో ఆ అభాగ్యుని వృద్ధమాత చుట్టూనిలిచిన రాజాధికారి శ్రేణి ఛేదించుకొని వచ్చి మంత్రి పాదాలమీద పడి వలవలా వాపోయింది! ఆ దొంగ ఆమె కేకైక పుత్రుడు! తన కుమారు డిదివర కెన్నడు అటువంటి దారుణాపరాధం చెయ్యలేదనీ ప్రథమ తప్పిదం మన్నించవలసినదనీ ఆవృద్ధమాత దీనాతి దీనంగా ఆక్రోశించింది. ఆనాటి కాశ్మీరరాజ్యంలో ఎవరినైనా క్షమించి విడిచిపెట్టవచ్చును గాని దైవద్రవ్యం అపహరించినవారిని క్షమించి విడిచిపెట్టడానికి వీలులేదు! అందులోను ఆ అభాగ్యు డపహరించినది శివద్రవ్యం! తత్రాపి అది అమ్మవారి ముక్కెర. అది అవంతివర్మ మహారాజు ప్రత్యేకంగా సభక్తికంగా అమ్మవారికి సమర్పించుకొన్న ముక్కెర! ఆ పరిస్థితులలో శూరమంత్రి మాత్ర మేమిచెయ్యగలడు! ఆ వృద్ధురాలి దీన రోదనధ్వని వినలేక తటాలున ముఖం మరిఒక పక్కకు తిప్పివేసుకొన్నాడు! అది గ్రహించిన రాజసేవకులు వెంటనే ఆ వృద్ధురాలిని బలవంతంగా అక్కడనుంచి తొలగించి వేశారు!

అయినా ఆ వృద్ధురా లలాగ గోలుగోలున విలపిస్తూనే ఉంది. ఆమె దారుణాక్రందధ్వని ఆ పరిసరంలో అంతటా ఒక వన్యపశువు ఆక్రోశధ్వనిలా జాలిగా సన్నసన్నగా ప్రతిధ్వనించింది.

శూరమంత్రి వెంటనే తన భవంతికి వెళ్లిపోయి ఏకాంతంగా ఒక చోట జేరి రెండు చేతులతోను తల గట్టిగా పట్టుకొని కూర్చున్నాడు. రెండు చెవులు బొటన వ్రేళ్లతో గట్టిగా మూసుకొన్నాడు. అయినా ఆ అభాగ్యురాలి ఆక్రందన ధ్వని అతని ప్రతినాడీస్పందనంలోను కరుణాతికరుణంగా, దీనాతి దీనంగా ప్రతిధ్వనించింది!"

మంత్రి శిరస్సు దారుణశిరో వేదనతో శతధావ్రయ్యలై పోయింది. తీవ్ర శిరోవేదనతో బాధపడుతున్నానని చెప్పి అతిడానాటికిక అన్నపానాలే ముట్టలేదు. ఇక ఆ రాత్రి రాత్రిఅంతా అతని కొక్కకునుకైనా పట్టలేదు.

ఆ రాత్రి తెల్లవార్లు అతనికిక ఆ వృద్ధమాత దీనాక్రోశమే వినిపించింది. ఆ క్షణంలో అతనికా రెండవ అపరాధిని క్షమించి విడిచిపెట్టివెయ్యవలెనని అనిపించింది. ఆ మరునాడుదయమే లేచి ఆ అపరాధుల సంగతి ఏమయినదని దౌవారికులను ప్రశ్నించాడు. వారిద్దరికి మంత్రి ఆజ్ఞప్రకారం అంతకు పూర్వమే శిక్షలు విధించడం జరిగిపోయిందని వారు సమాధానం చెప్పారు!

మంత్రి అంతకుపూర్వం ఎందరెందరో శివద్రోహులకు శిక్షలు విధించాడు. కాని అంతటి దారుణ శిక్షలు విధించవలసినంత అవసరం అంతకుపూర్వం ఎన్నడు కలగలేదు. అయితే ఆ అపరాధులు చేసిన ఘోరాపరాధాల దృష్ట్యా మంత్రికిక మరి గత్యంతరమే కనిపించలేదు! ఎంతటి దయార్ద్రహృదయుడైతే మాత్రం! అతడేమి చెయ్యగలడు? ఆ నాటి కాశ్మీర శిక్షాస్మృతి సంప్రదాయం తీరే అంతటిది!

దౌవారికులు చెప్పిన సమాధానం విని మంత్రి అలాగే నిర్ఘాంతపోయాడు. ఆ తరవాత గతించినదానిని గురించి మథనపడడంవల్ల ప్రయోజన మేమిలేదని కొంచెం సమాధాన పడ్డాడు.

కాని అప్పటినించీ శూరమంత్రి హృదయంలో కాశ్మీర మహామాత్య పదవి విసర్జించి వెంటనే వారణాసికి వెళ్ళిపోవాలనే సంకల్పం బయలుదేరి బాగా బలపడింది. ఆసంకల్పం అతని హృదయంలో అంతకుపూర్వమే అంకురించింది గాని ఆ నాటితో అది బాగా వేరుదన్నింది.

శూరమంత్రి కప్పటికి యాభైయో పడి దాటి అరవయ్యోపడి బాగా పైబడింది. అతని జ్యేష్ఠకుమారుడప్పటికి బాగా ప్రాజ్ఞుడైనాడు. రెండవ కుమారునికి బాగా ప్రాజ్ఞత వచ్చే వయస్సేమో వచ్చింది గాని ఆకతాయితనం మాత్రం నానాటికీ హెచ్చుపెరిగిపోయింది. అతన్ని ఒక ఇంటివాణ్ణి చేసి కొంచెం మంచిదారిని పెట్టిన తరవాత సకళత్రంగా వారణాసికి వెళ్ళిపోయి శ్రీ విశ్వేశ్వరదేవ శ్రీ పాదసన్నిధిని తన జీవితశేషం యావత్తు గడిపివెయ్యాలని అతడంతకు పూర్వమే సంకల్పించుకొన్నాడు. కాని రెండవ కుమారుడు పినాకధన్వమీది మమకారము, నానాటికీ హెచ్చుపెరిగిపోతున్న అతని ఆకతాయి తనము ఒకదానికొకటి తోడై అతని సంకల్పసిద్ధికొక గొప్ప అంతరాయం కలిగించాయి.

అతడలాగే రెండు చేతులతోను తల గట్టిగా అదిమి పట్టుకొన్నాడు. త్రికరణశుద్ధిగా భూతేశ్వర స్వామినొక్కమారు ధ్యానించుకొన్నాడు:

"స్వామీ! ఇంకా ఎంతకాలం నాకీ భవబంధనం కల్పించదలిచావు తండ్రీ! నేను నీ యెడల చేసిన అపరాధమేమి? నామీద నీకెందు కింతగా దయతప్పింది. నీ పాదసన్నిధికి చేరుకునే అదృష్ట మిక నాకెన్నటికీ లభ్యం కాదా!"

ఆ ధ్యానతత్పరతలో అతనిహృదయంలో హఠాత్తుగా మెరుపులా ఒక అభిప్రాయం స్ఫురించింది.

"ఆ అపరాధులు తాముచేసిన ఘోర పాపాలకు తగిన ప్రతిఫలం అనుభవించారు. దీనికి నేనెందుకు విచారించాలి! నాధర్మమేదో నేను దైవముఖం చూచి సరిగా తూచినట్టుగా నిర్వర్తించాను! ఇంతకీ ఎవరి కర్మ ఫలితాని కెవరు కర్తలు?"

అని అంతలోనే ధైర్యం తెచ్చుకొని గుండె రాయిచేసుకొన్నాడు. కర్తవ్య నిర్వహణలో అతనిహృదయం ఒకొక్కప్పుడు మృదులాతిమృదులమైన కరుణాప్రవాహమై వెల్లివిరిసిపోతుంది. ఒకొక్కప్పుడది వజ్రంకన్నా కఠినమై నిష్ఠురరూపం ధరిస్తుంది. ఆ క్షణంలో అతని హృదయంలో సరిగా అటువంటి పరిణామమే జరిగింది.

## 3

అటువిమ్మట శూరమంత్రి కాశ్మీరంలో దేవమాన్యాలుగాని దైవద్రవ్యంగాని అపహరించిన వారి నందరినీ నిర్దాక్షిణ్యంగా హతమార్చి వేశాడు. దానితో క్రమక్రమంగా అతని హృదయానికి కొంచెం సంతృప్తి కలిగింది. ఆపైన అతని కుమారుడు పినాకధన్వకూడా క్రమక్రమంగా దారికి వస్తున్నట్టే కనిపించాడు. ఎప్పుడులేని దతడొకనాడు భూతేశ్వరస్వామి ఆలయానికివెళ్ళి స్వయంగా స్వామికి సువర్ణ బిల్వదళాలతో సహస్రనామార్చనాదులు జరిపించివచ్చాడు. అదివిన్న మంత్రి అతన్ని చూడగానే గాఢంగా కౌగలించుకొన్నాడు. క్రమశః భూతేశ్వరస్వామి కటాక్షలేశం తనపై ప్రసరించినదని పరమానంద భరితుడైనాడు.

అలాగ ఒకపక్షంరోజులు గడిచిపోయాయి. ఒకనాడు శూరమంత్రితన కొలువుకూటంలో రాజకార్యాలన్నీ శీఘ్రంగా ముగించుకుని తొందర తొందరగా భవంతికి వచ్చివేశాడు.

(55-వ పేజీ చూడండి)

కలవరపడు స్త్రీలకు



"కుమారి" మాత్రలు మరువకండి. మీ ఆరోగ్యం రక్షించును. చింతఅనవసరం
వెల (సాదా) రు. 3/-
(స్పెషల్) రు. 5/-
(ఎక్స్ట్రా స్పెషల్) 8/-
పోస్టేజిప్యాకింగు ప్రత్యేకం

Mrs. P. Devee, F.D.S. (AP) Calcutta-40.
స్టాకిస్టు: Indo Medical supplies
No. 3 Paullappan st. Seven wells
Madras - 1.

# పరమ శివార్చన ★

[23 వ పేజీ తరువాయి]

ఆనాడు మాఘమాస శివరాత్రి. భవంతికి రాగానే మంత్రి మళ్ళీ స్నానంచేసి పరమ శివార్చన కుపక్రమించాడు. దశ సహస్ర పంచాక్షరీమంత్ర జపంతో అతని మన స్సోంకార తరంగడోలికలలో ఓలలాడింది. అతని హృదయం భూతేశ్వర పాదపద్మధ్యానంలో నిశ్చలమై నిలిచింది. అతని కనుగొలుకుల నుండి అప్రయత్నంగా ఆనందబాష్పా లేకధారగా ప్రవహించాయి.

మంత్రి అటుపిమ్మట అలాగే శివ పంచాక్షరీ మంత్రం పునశ్చరణ చేస్తూ కూర్చున్నాడు.

అంతలో అతని పూజాగృహానికి పార్శ్వంలోఉన్న గదిలోనుంచి ఏవో గుసగుసలు, బెదిరింపులు, హెచ్చరికలు వినిపించాయి. ఆపైన ఎంత ప్రయత్నించినా మంత్రి హృదయాని కేకాగ్రత కలగలేదు.

ఆ పక్కగదిలో అతనిభార్యజయమంగళ, కుమారుడు పినాకధన్వ కేమేమోబోధిస్తూంది. మొట్టమొదట ఆమె అతని నెంతో ఆప్యాయంగా బతిమాలుకుంది:

"నీకీ కటికి బందిపోటులతో సహవాసమెందుకు నాయనా! నీకేమి లోటని! కావలిస్తే నా రత్నాభరణాలన్నీ తీసుకుపో! నీ యిష్టం వచ్చినట్టు వినియోగించుకో! ఇది మీ నాయనగారికి తెలియనివ్వనులే. అంతేగాని శివద్రవ్యం జోలికిపోకు ధన్వా! మీ తాత ముత్తాతలందరు భూతేశ్వరస్వామి కెన్నెన్నో మడిమాన్యాలు, ఎన్నెన్నో రత్నహారాలు సమర్పించుకొని తరించారు! ఇటువంటి పని ఇంకెప్పుడూ చెయ్యకు! ఇది సాక్షాత్తు కర్కోటక నాగునితో చెలగాటం నాయనా!"

జయమంగళ అతని ఇంకా అనేక విధాలుగా బుజ్జగించింది.

"అమ్మా! నావల్ల పొరబాటే జరిగిపోయిందిలే! ఇక నేనెప్పుడు ఇటువంటి పనులు చెయ్యనులే! మరి వెంటనే నీ పచ్చలహారం తీసి నాకియ్యి!"

అన్నాడు పినాకధన్వ. ఆ మాటలు మంత్రికి స్పష్టంగా వినిపించాయి. మంత్రి వెంటనే తన చేతనున్న రుద్రాక్ష జపమాల అక్కడపెట్టి, ఆ గదితలుపు సందులలోనించి అదంతా అతిజాగ్రత్తగా పరిశీలించాడు. పినాకధన్వ ముఖంలో అతనికి పశ్చాత్తాప సూచనలేవీ కనిపించలేదు. పైగా అతడది తనకేమీ పట్టనట్టుగా అలాగే నవ్వుతూ కూర్చున్నాడు.

శూరమంత్రి హృదయంలో ఒక పెద్ద పిడుగుపడింది. అంతలో జయమంగళ తన మెడలోని పచ్చలహారం తీసి కుమారునిచేతి కందించింది.

ఇక మంత్రి నిలవరించుకోలేకపోయాడు. కాయశక్తులా ఆ గదితలుపు గట్టిగా తట్టాడు. జయమంగళ తొందరగావచ్చి ఆ గదితలుపు తెరిచింది. అంతలోనే పినాకధన్వ ఆ పచ్చల హారం చేజిక్కించుకొని ఒక్క అంగలో వీధిలోకి ఉడాయించాడు. జయమంగళ భర్త రాకడచూచి బాగా భయపడింది.

"ఏమిటిదంతా?"

అని మంత్రి గట్టిగా గద్దించి అడిగాడు. జయమంగళ మరి లాభంలేదని గ్రహించుకుని భర్తతో జరిగినదంతా వెళ్లబోసుకుంది:

"ఏమి చెయ్యను! ఇదంతా నా ప్రారబ్ధం! మన ధన్వ నిన్న రాత్రిబందిపోటు దొంగలతో కలిసి భూతేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారి పచ్చలహారం అపహరించాడట! నాకది ఈ వేళ ఉదయమే తెలిసింది. వెంటనే వాణ్ణి నయానా భయానా బుజ్జగించి, రెండోకంటివాడికి తెలియకుండా ఆహారం మళ్లీ అమ్మవారి దేవాలయానికి పంపించివేశాను. ఇకనించి వాడెప్పుడు ఇలాంటిపనులు చెయ్యనని నాకు వాగ్దానం చేశాడు. అసలే వాడు బాగా బెంబేలుపడిపోయాడు! మీ రిక వాణ్ణేమీ అనకండి! నామాటవిని కొంచెం తమాయించండి!"

శూరమంత్రి శిరస్సుపై ఇంకొక పెద్ద పిడుగుపడింది. క్షణంకాలం పాటతడు తన కళ్లే నమ్మలేక అలాగే శిలాప్రతిమలా నిర్ఘాంతపోయాడు. మరుక్షణంలో కఠినంగా గర్జించాడు:

"ఇంతటి ఘోరాపచారం జరిగినా ఇంతవరకు నాతో ఎందుకు చెప్పలేదు?"

"శివరాత్రిపూట మీ కీ రభస అంతా చెప్పడాని కిష్టంలేక నేనే ఏదోవిధంగా సర్దుబాటుచేసుకున్నాను. ఏమిచెయ్యను! నేను చేసిన నోములన్నీ చివరికీ విధంగా ఫలించాయి."

అని ఆమె పైటకొంగుతో కన్నీరు తుడుచుకుంది. మంత్రి మళ్ళీ గర్జించాడు:

"నీమూలంగానే వాడీవిధంగా పచ్చి బందిపోటుదొంగగా మారిపోయాడు. దీనికంతటికీ నీవే కారణం! ఇక నేనిది భరించలేను! వాడీక్షణంనించీ నా గుమ్మం తొక్కడానికి వీలులేదు!"

మంత్రి అలాగే రోజుతూ ఆమెవైపు చూచాడు. జయమంగళ ఆమాట విని మొదలు నరికిన తరువులా నేలపై కూలబడిపోయింది. ఆపైన వలవలా ఏడవడం మొదలుపెట్టింది:

"పోనీయండి! నేనేమిచెయ్యను! నేను చేసుకున్న పుణ్యమే అంత! మీ అదృష్టం కొద్దీ మీకా మొదటి సంబంధంవల్ల రత్నంవంటి కుమారుడు కలిగాడు. నా దురదృష్టం కొద్దీ నాకెంతకాలానికీ సంతానమేకలగలేదు! పోనీ అని ఒక పసివాణ్ణి దగ్గిరికితీసుకుంటే వాడిలాంటివాడై పోయాడు!"

"అయినా అయినదానికీ కానిదానికీ పసివాణ్ణిలాగ భయపెడితే ఎలాగ! ఏదో నయానా భయానా సంబాళించుకోవాలిగాని! ఈ మిట్టమధ్యాహ్నంవేళ వాడలాగ బెంబేలుపడి ఎక్కడికి వెళ్ళిపోయాడో! ఇంతకీ నా నొసటిరాత ఈ విధంగా ఉంటే ఇంకొకరి ననవలసినపని ఏమిఉంది!"

అని జయమంగళఅలాగే కంటికీ మంటికీ ఏకధారగా ఏడ్చింది.

"వాడు పసివాడా? పాతికేళ్లు పైబడుతున్నా ఇంకా పసివాడేనా? నీ గారాబమే వాణ్ణింతవరకు తెచ్చింది!"

శూరమంత్రి మరి అక్కడ నిలబడలేక అలాగే రోజుకుంటూ తిరిగి తన పూజాగృహంలోకి వెళ్ళి పరమశివుని పాదాల మ్రోల సాగిల పడ్డాడు:

"పరమేశ్వరా! నాకిటువంటి దత్తపుత్రుణ్ణెందుకు ప్రసాదించావు! నీ కెంతకాలానికి మరి నామీద కరుణకలగదా! నాకిక ఈ సంసార కారాగారంలోనించి విముక్తి లభించదా?"

అని మంత్రి అనేకవిధాలుగా వాపోయాడు. తరవాత తిరిగీ రుద్రాక్షమాల చేత ధరించి నిశ్చలహృదయంతో పంచాక్షరీ మంత్ర పునశ్చరణ కుపక్రమించాడు.

—సశేషం.



# పరమ శివార్చన

గత సంచిక తరువాయి

౪

శూరమంత్రి పినాకధన్వ చేసిన చౌర్యం ఆమూలాగ్రంగా అవగాహన చేసుకోవాలని నిశ్చయించి వేగులవారిని కొందరిని పిలిపించి అతి రహస్యంగా ఆ వ్యవహారం అంతా గాలించవలసిందని ఆజ్ఞాపించాడు.

మంత్రి అనుక్షణము వెయ్యి కళ్ళతో కాశ్మీర రాజ్య వ్యవహారాలన్నీ పరిశీలిస్తూనే ఉంటాడు. అయినా తన కుమారుడే చౌర్యం చేసినా అతనికది లవలేశమైనా తెలియలేదు. దాని కతడెంతో నొచ్చుకున్నాడు. భార్యకావిషయ మేమైనా కొంచెం లోతుగా తెలిసి ఉండవచ్చునని ఆమెనడిగి చూచాడు.

జయమంగళ తనకా విషయం అంతకంటె తెలియదనీ, ధన్వ తన దంతపేటికలో ఆ పచ్చలహారం అతిరహస్యంగా దాచివేస్తూంటే చూచి పట్టుకొని వెంటనే అది భూతేశ్వరస్వామి ఆలయ ధర్మాధికారికి పంపించివేశాననీ చెప్పింది. అంతకు మించి తానా విషయం ఏమీ ఎరగనని కంట నీరు పెట్టుకుంది.

మంత్రికి జయమంగళ చెప్పినది నమ్మక తప్పలేదు! ఎంతటి రహస్య విషయమైనా ఆమె కతనిదగ్గర ఆ రహస్యం దాచే అలవాటు లేదు! అసలే ఆమె కుమారు డిల్లు విడిచి వెళ్ళిపోయాడని బెంగటిల్లి కుమిలి కృశించిపోతూంది. ఆ పరిస్థితులలో ఆమె నిక నొప్పించడం వల్ల ప్రయోజనమేమీ లేదని మంత్రి మరి ఆ సంగతి ఆమెతో ప్రస్తావించలేదు.

ఆపైన నయానా భయానా బుజ్జగించి ఆ విషయం ధన్వనడిగి తెలుసుకోవాలని అనుకున్నాడు. కాని అతడు మళ్ళీ తిరిగి భవంతికే రాలేదు!

మంత్రి నొక్క అనుమానం గట్టిగా పట్టుకుని పీడించింది. భూతేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారి ముక్కెర కాజేసిన బందిపోటు దొంగ దొంగతనానికీ, ధన్వ చేసిన దొంగతనానికీ ఏదో గట్టి సంబంధం ఉండి తీరాలని అతని అనుమానం! ఆ బందిపోటు దొంగ ముక్కెర అపహరించాడు. ధన్వ పచ్చలహారం అపహరించాడు. రెండు భూతేశ్వరస్వామి ఆలయంలో, తత్రాపీ అమ్మవారి ఆలయంలో జరిగిన చౌర్యాలే!

అయితే ముక్కెర అపహరించిన దొంగ కతడప్పుడే దారుణ మరణశిక్ష విధించివేశాడు. అతని మూలంగా ఇక ఆ రహస్యం ఛేదించే ఆస్కారమేమీ లేదు. మంత్రి కెలాగైనా ఆ రహస్యం ఛేదించి తీరాలని గట్టిపట్టుదల కలిగింది.

వెనువెంటనే భూతేశ్వరాలయ ధర్మాధికారి కంచెలమీద కబురు పెట్టాడు. మంత్రి పిలిపించారన్న మాట వినగానే ఆలయ ధర్మాధికారి రెక్కలు కట్టుకొని ఆయన భవంతిలో వాలిపోయాడు. మంత్రిని చూస్తూనే అతడు సవినయంగా దోసిలిఒగ్గి నిలుచున్నాడు. శూర మంత్రి గుక్క తిప్పుకోకుండా అతని మీద ప్రశ్నలవర్షం కురిపించాడు.

"అమ్మవారి ఆలయంలో జరిగిన దొంగతనంలో ఏయే ఆభరణాలు పోయాయి?"

"ముక్కెర, పచ్చలహారం, రత్నాంగులీయకం."

రత్నాంగులీయకం కూడా దొంగలపహరించిన విషయం మంత్రి కంతవరకు తెలియనే లేదు. అతడు లోలోపల నిర్ఘాంతపడినా పైపైకదేమీ కనబడనీయలేదు:

"ఆ అంగులీయకం విషయం నాకింతవరకు తెలియనేలేదే?"

"ఈ స్వల్ప విషయానికి తమ దాకా ఎందుకని నగర దండనాయకుల కది తెలుపుడు చేసుకున్నాము."

"అంగులీయకం అపహరించిన వారెవరు?"

"ఇంకా అది దొరకనేలేదు!"

"ఈ మూడు చౌర్యాలు ఎంత వ్యవధిలో జరిగాయి?"

"ఒక్క నాటి రాత్రే!"

"బందిపోటు దొంగలెంత మంది వచ్చారు?"

"నలుగురైదుగురు వచ్చారట!"

"అందరు దొరికారా?"

"లేదు!"

"ఎంతమంది దొరికారు!"

"ఈ విషయంలో తమకు తెలియనిదేముంది? ఇంత వరకు—ఒక్క దొంగ మాత్రమే పట్టుబడ్డాడు! అతనికి తామే మరణదండన విధించారు!".

ఆ వ్యంగ్య సమాధానం శూరమంత్రి గుండెల్లో సూటిగా పొడుచుకుంది. అయినా అతడది అణువంతైనా పైకి వ్యక్తంకానీయలేదు. అటుపిమ్మట మంత్రి ధర్మాధికారి నేవేవో రెండు మూడు చిన్న విషయాలడిగి ఆ పరిశీలన అంతటితో ముగించివేశాడు. వెంటనే ధర్మాధికారి తిరిగి వెళ్ళిపోయాడు.

అంతటితో శూరమంత్రికి కుమారునికా దొంగతనంలో పాలున్నదనిగట్టి అనుమానం కలిగింది. ఇక అతని నెలాగైనా నెమ్మదిగా బుజ్జగించి ఆ విషయం లోతుపాతులన్నీ క్షుణ్ణంగా తెలుసుకునితీరాలని నిశ్చయించుకొన్నాడు.

పినాకధన్వను చిన్నప్పటినించీ ఎత్తుకొని లాలించి పెంచిన ఒక దాదిని పిలిచి ధన్వ నెలాగైనా వెతికి పట్టుకుని నెమ్మదిగా బుజ్జగించి ఇంటికి తీసుకురావలిసిందని ఆజ్ఞాపించాడు.

సామాన్యంగా దత్తపుత్రులకు కొన్ని అవగుణాలలవడుతూంటాయి. ధన్వకా గుణాలు మరింత బాగా అలవడ్డాయి. చిన్నప్పటినించీ జయమంగళ అతని నెంతో గారాబంగా పెంచి పెద్దవాణ్ణి చేసింది. ఆ గారాబంవల్ల శూరమంత్రి కతనిని బాగా అదుపులో పెట్టవలసిన ఆవశ్యకత ఏర్పడింది. దానాదీనా పినాకధన్వకు చిన్నప్పటినించీ ఆకతాయితనము, మంకుపట్టు మొదలైన అవగుణాలన్నీ బాగా అలవడ్డాయి. ఆపైన ధన్వ తలిదండ్రులు చాలా సామాన్య సంసారులు. నాలుగైదేళ్ళ వయస్సు వచ్చేవరకు అతడా పరిస్థితులలోనే పెరిగాడు. అటు పిమ్మట శూరమంత్రిభవంతిలో అతనికి మహారాజభోగాలలవడ్డాయి. జయమంగళ అత

పిం. గణపతిశాస్త్రి



ఏది అడిగినా తండ్రికైనా తెలియకుండా చాటుమాటుగా అతనికందిచ్చి అల్లారు ముద్దుగా పెంచి పెద్దవాణ్ని చేసింది. ధన్వ చిన్నతనంలో ఒకమారు తనకొక పెద్దఏనుగు, జరీ అంబారీ కావాలని మంకుపట్టుపట్టాడు. ఆ రోజుల్లో అది మహాభోగులుపయోగించే అత్యుత్తమ వాహనం! అయినా దానికామె వెనకాడలేదు! ఆ విషయం భర్తతోనైనా సంప్రదించకుండా ఆ మరునాడే కుమారుని ముచ్చట తీర్చింది. అది తెలిసి మంత్రి ఆమె మీద విసుక్కున్నాడు. గురుకులవాసం చేసి చక్కగా శాస్త్రాభ్యాసం చెయ్యవలసిన వయస్సులో అటువంటి వినోద విహారాలు పనికిరావని కసురుకున్నాడు. కాని ఆమె మాట కెదురాడలేక ఆ విషయం చూసీచూడనట్టు మాట్లాడ కూరుకున్నాడు. అవిధంగా పెరిగి పెద్దవాడైన ధన్వ అతనికొక హృదయవ్యాధిగా పరిణమించడంలో ఆశ్చర్యం ఏమి ఉంది?

పినాకధన్వను వెదకడానికి వెళ్ళిన దాదికతని అనుపానులన్నీ బాగా తెలుసును. అందుచేత ఆనాటిరాత్రికే నెమ్మదిగా అతనినింటికి తీసుకువచ్చింది. కుమారుని చూడగానే జయమంగళకు ప్రాణం లేచివచ్చింది. క్రూరమంత్రికూడా అతనినేమీ అనలేదు! భర్తధోరణిచూచి జయమంగళ బాగాఆశ్చర్యపడింది. కాని ఆయన ఔదాసీన్యంలో ఏదో అంతరార్థం ఉన్నదని ఆమె ఒక్క క్షణంలో పసిగట్టివేసింది. తండ్రి వాత్సల్యం ధన్వకు మరింత ఆశ్చర్యం కలిగించింది.

ఆ మరునాడు మంత్రి పినాకధన్వనెంతో ఆప్యాయంగా తనదగ్గరికి పిలిచి ఆ రత్నాంగుళీయక మేమైనదో చెప్పవలసిందని బతిమాలుకున్నాడు. అది అపహరించడం కేవలం విషసర్పంతో చెలగాటమని హెచ్చరించాడు. జరిగిన సంగతి అంతా యథాతథంగా చెప్పివేస్తే మహారాజది అతని ప్రథమ తప్పిదంగా క్షమించి విడిచిపెట్టగలరనీ ఆ విషయం అంతా యథాతథంగా తెలియజేయమనీ పరిపరివిధాల బుజ్జగించి బతిమాలుకున్నాడు.

ఆ అనునయంతో పినాకధన్వకు తండ్రి

# ★ పరమశివార్చన ★

ఔదాసీన్యాని కంతరార్థం అంతా స్పష్టంగా తెలిసిపోయింది. ధన్వ కప్పటికి ఊరికే వట్టి పుణ్యానికి అబద్ధలాడడం ఒకపరిపాటిగా అలవాటయింది. ఎవరేనా ప్రశంగవశాత్తు 'భోజనం అయిందా' అని ప్రశ్నిస్తే భోజనం చేసినా అతడు తడుముకోకుండా చెయ్యనే లేదనే చెప్పివేస్తాడు. జయమంగళ తప్ప అందరు తన ననుమానిస్తున్నారనే అతని భయం!

అయినా అతడా భయమేమీ పైకి కనబడనీయకుండా నెమ్మదిగా తన చౌర్య కథ అంతా తండ్రికి తెలియజేశాడు. నలుగురు బందిపోటు దొంగలతో కలిసి తాను భూతేశ్వరస్వామి ఆలయం దోచుకున్న మాట నిజమే అని అంగీకరించాడు. పోయిన నగలలో పచ్చలహారం తాను చేజిక్కించుకొన్నానని ఒప్పుకొన్నాడు. మిగిలిన నలుగురిలోను ఒకడు ముక్కెర, మరి ఒకడు రత్నాంగుళీయకము, అపహరించారనీ వారిలో ముక్కెర అపహరించినవాడే మరణ దండన అనుభవించాడనీ రత్నాంగుళీయకం అపహరించినదొంగ మిగిలిన ఇద్దరితోను కలిసి ఆ రాత్రే శ్రీనగర పరిసర పర్వత గుహలలోకి పారిపోయాడనీ చెప్పాడు. ఆ పైన వారి సంగతి తనకేమీ తెలియ లేదని అన్నాడు.

మంత్రి అతని నెన్నో విధాలుగా ఆ విషయాలన్నీ గుచ్చి గుచ్చి అడిగాడు. ధన్వ ఆ దొంగల పేరులు, వారితో తన కేర్పడిన సంబంధము మొదలైన విషయాలన్నీ పూస గుచ్చిన ట్లేకరువు పెట్టాడు.

మంత్రి కతని మాటలు వింటూంటే అవన్నీ యథార్థాలే అయి ఉండవచ్చునని నమ్మకం కలిగింది. అయితే ధన్వ ఏదో కొంచెం మెలత వేస్తున్నాడని కూడా అనిపించక పోలేదు. ఎంత ప్రయత్నించినా ఆ మెలత ఏదో అతనికి బోధపడలేదు. క్రమక్రమంగా అదే బోధపడి తీరుతుందనీ అప్పుడిక ధన్వను బెదిరించడంవల్ల ప్రయోజన మేమీ లేదనీ నిశ్చయించి, మంత్రి ఆ ప్రస్తావన అంతటితో ముగించివేశాడు.

ఇక అటువంటి దుస్సాహసాలు చెయ్య వద్దని ధన్వ కనేక విధాల హితబోధ చేశాడు. ధన్వ తనఅపరాధం మన్నించవలసినదనీ ఇంకెప్పుడు అటువంటి సాహసాలు చెయ్యననీ నలుగురిలోను తనకప్రతిష్ఠ రాకుండా రక్షించవలసిందనీ ప్రార్థించాడు. మంత్రి అతని ప్రార్థన విని ఒక్క వేడినిట్టూర్పు విడిచి పెట్టాడు.

---

పినాకధన్వ చెప్పిన విషయాలన్నీ విని మంత్రి చాలాసేపటివరకు ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు. మరి కొంత సేపటికా దీర్ఘాలోచన ముగించాడు. ఆ మిగిలిన ముగ్గురు బందిపోటు దొంగలను వెంటనే వెదికి పట్టుకోవలసిందని శ్రీ నగర దండనాయకుని కొక శ్రీముఖం పంపించాడు. శ్రీ నగర పరిసరారణ్యాలలోని కొండలు, గుహలు, గుట్టలు అన్నీ గాలించి తీరవలసిందని ఆ శ్రీముఖంలో ప్రత్యేకంగా ఉట్టంకించాడు.

ఆ క్షణంనించి అతని హృదయంలో ఒక పెద్ద కొండ మోపినట్టయింది. అతడనేక విధాలుగా మథనపడ్డాడు.

నేడో రేపో ఆ దొంగలు ముగ్గురు దొరికి తీరతారు. అప్పుడు వారి చౌర్యాలతో బాటు పినాకధన్వచేసిన చౌర్యం కూడా అందరికీ తెలిసితీరుతుంది. ఆ దొంగలను ముగ్గురినీ గట్టిగా నిర్బంధించి అడిగినప్పుడు వారు తమకు, పినాకధన్వకు మధ్యన నడిచిన వ్యవహారం అంతా నలుగురిఎదట వెల్లడించక మానరు. అప్పుడిక తానందరిలోను తల ఎత్తుకుని తిరగగలడా? పినాకధన్వ అపహరించిన పచ్చలహారం తిరిగి దేవాలయ ధర్మాధికారికి పంపించివెయ్యడం వల్ల అతనికి దారుణ మరణశిక్ష తప్పితే తప్పిపోవచ్చును! కాని అతని మూలకంగా తనకు వచ్చే అప్రతిష్ఠ మాట! తానిక ఏముఖం పెట్టుకొని మహారాజు సమక్షంలో నిలబడగలడు? ఇప్పుడిక తన కర్తవ్యమేమిటి?

ఆవిధంగా అతని మథన ఎంతసేపటికీ ఎటు తెగలేదు. ఆ విషయంలో కాశ్మీరాస్థాన విద్వత్కవి శివస్వామి నొకమారు సందర్శింపవలెనని అనుకొన్నాడు. వెంటనే శివస్వామి భవంతి కొక ఆందోళికపంపించాడు. ఎలాగైనా ఒకమారు దర్శన మివ్వవలసిందని శివస్వామికి కబురు పంపించాడు. శివస్వామి రాగానే అతనితో కలిసి తన రహస్య మంత్రాగారం లోనికి వెళ్ళిపోయాడు.

శివస్వామి శూరమంత్రి కత్యంతాప్తుడు. నిత్యశివపూజా ధురంధరుడు. మంత్రి అప్పుడతనితో కలిసి ఇష్టాగోష్ఠి ప్రసంగాలు జరుపుతూంటాడు. కుశల ప్రశ్నాదికం జరిగిన పిమ్మట మంత్రి తన మనస్సులోని మాట అతని ఎదట బయలు పెట్టాడు:

“నేనీ మహాశివరాత్రి వెళ్ళగానే వారణాసికి వెళ్ళిపోయి, ఇక ఈ జీవిత శేషం అంతా అక్కడే గడిపి వేద్దామని అనుకుంటున్నాను.”

శివస్వామి ఆ మాట విని నిశ్చలదృష్టితో మంత్రి ముఖం పరిశీలించాడు:

“ఇప్పుడింతటి తొందర ఏమివచ్చింది?”

“నాకు క్రమంగా శరీరపాటవం తప్పిపోతూంది. ఇటీవల మా ధన్వమూలాన కొంత మన స్తిమితం కూడా చెడింది. నాకీ రాజ్యకార్య వ్యాసంగం వల్ల నిత్యము నిర్వర్తించుకునే పరమశివార్చనకు కూడా వ్యవధి దొరకడం లేదు.”

శివస్వామి అది విని కొంచెం హేలగా నవ్వి కర్పూర తాంబూలచర్వణం ప్రారంభించాడు:

“మీ వంటి వారే ఇలాగంటే నే నేమనను! రాజకార్యవ్యాసంగంలో మీరనుక్షణము చేస్తున్నది పరమేశ్వరార్చనమే! ఈ వయస్సులో దీని కోసం ప్రత్యేకంగా వారణాసికి వెళ్ళవలిసినంత అవసరం ఏమి వచ్చింది!”

శూరమంత్రి కతని మాటలలోని అంతరార్థం విస్పష్టంగా అవగాహన కాలేదు. బొమముడి విరిచి జిజ్ఞాసా దృష్టితో శివస్వామి వైపు చూచాడు.

శివస్వామి తిరిగి హేలగా నవ్వాడు:

“మహామంత్రీ! ఈ కాశ్మీర ధరణి సాక్షాత్తు పరమశివుని అర్ధాంగి అనీ కాశ్మీరాధీశ్వరులు కేవలం పరమశివాంశస్వరూపులనీ మన పురాణ వేత్తలుద్ఘోషిస్తున్నారు. తత్రాపి మన అవంతి వర్మాధీశ్వరులు సాక్షాత్తు ఆర్షధర్మ స్వరూపులే! ఆ ఆర్షధర్మ నిర్వహణలో మీరనుక్షణము పరమ శివార్చన చేస్తూనే ఉన్నారు. మీ చల్లని పరిపాలనలో కాశ్మీర ప్రజ హాయిగా గుండెల మీద చేతులు వేసుకొని నిద్రపోతున్నారు. మీ మూలంగా ఆర్షధర్మదేవత కాశ్మీరంలో అంతటా నాలుగు పాదాలతోను యథేచ్ఛగా విహరిస్తున్నది. ఇంతకన్నా వేరే పరమశివార్చన ఏమి ఉంది! మీకుమాత్రం ఈ విషయం తెలియదు గనకనా?”

శివస్వామి ముత్యాలచూర్ణంతో మెదిపిన కర్పూరతాంబూలం పుక్కిట బెట్టి మళ్లీ ఒక చిరునవ్వు నవ్వు చిందించాడు. ఆ చిరునవ్వతని చెక్కిళ్లపై రత్నకుండనాల వరకు విస్తరించింది.

మంత్రికతని ధర్మస్వరూప వివరణతో హఠాత్తుగా ఒక కనువిప్పు కలిగింది. ఆమహావిద్వాంసుని విద్వత్తు, విజ్ఞత, అనేకవిధాల శ్లాఘించాడు. శివస్వామి మరికొంత సేపు మంత్రితో ఇష్టాగోష్ఠి జరిపి తిరిగి తన భవంతికి వెళ్ళిపోయాడు.

శూరమంత్రి మళ్లీ మథనలో పడ్డాడు. శివస్వామి వివరించినట్లు కాశ్మీర రాజ్య ధర్మనిర్వహణం కన్న వేరే పరమశివార్చన ఏమి ఉంది? అది అక్షరాలా యథార్థమే!

అయితే ఇటీవల ఆ ధర్మనిర్వహణలో తాను కొంచెం పొరబడ్డానేమోనని మంత్రికి కొంచెం భయంవేసింది. అదే సమయంలో

అతని హృదయంలో ఆ వృద్ధమాత దీనాక్రోశం మంద్రమంత్రంగా ప్రతిధ్వనించింది. ఆ బందిపోటు దొంగ తల్లి అంత దీనంగా ఆక్రోశిస్తూన్నా వినిపించుకోకుండా వెంటనే అతనికి ఘోర మరణదండన విధించాడు. కాని తన కుమారుడు చేసిన తప్పిదం ఇంతవరకు ఇతరు లెవరికి తెలియజేయలేదు. అత డపహరించిన హారం తిరిగి భూతేశ్వర దేవాలయం ధర్మాధిపతికి జేరి ఉండవచ్చును. కాని ఆ విషయం తనపై ధర్మాధికారి అయిన మహారాజు అవంతివర్మకు తెలియజెయ్యకపోవడం ఒక పెద్ద తప్పిదమే అని మంత్రి నిశ్చయించుకొన్నాడు. వెంటనే మహారాజ సన్నిధికి వెళ్ళి ఆ విషయం అంతా ఆ మూలాగ్రంగా పూసగుచ్చినట్లేకరువుపెట్టాడు. తన కుమారుని అపరాధానికి తగిన శిక్ష విధించవలిసిందని చేతులు జోడించి ప్రార్థించాడు.

అవంతివర్మ ధర్మదేవత సాక్షాత్కరించినట్లుగా తనకెదురుగా దోసలిఒగ్గినిలబడిన శూర మంత్రిని చూచి కొంతసేపటివరకు నోటమాట లేక అలాగే నిర్ఘాంతపోయాడు. ఆపైన కలకలనవ్వాడు:

"మీ కుమారునికి శిక్ష విధించడానికి నేనెవరిని! మీరే ఈ కాశ్మీరరాజ్యానికంతటికి ధర్మాధికారులు! ఆ ధర్మమేదో మీరే నిర్ణయించండి!"

మంత్రి ఇంకా అలాగే దోసిలిఒగ్గి నిలబడి తిరిగి సవినయంగా విన్నవించుకొన్నాడు:

"మహాప్రభూ! తమరలాగ సెలవియ్యడం ధర్మంకాదు. ఈ రాజ్యానికంతటికీ ఏకైక ధర్మాధికారులు తామే! మీ తరవాతనే నా ధర్మాధికారం. ఈ విషయంలో అపరాధం చేసినవాడు సాక్షాత్తు నా కుమారుడు! అందుచేత నేనీవిషయం నిర్ణయించడం న్యాయంకాదు! కనక ఇక మీరే ఇక్కడ ధర్మనిర్ణేతలు!"

అవంతివర్మ మళ్ళీ కలకల నవ్వాడు:

"కావచ్చును! ఇంతకీ మీ కుమారుడపహరించిన హారమేమో తిరిగి అమ్మవారికి జేరిపోయిందికదా! దీనిలో ఇక అతని అపరాధమేమి ఉంది?"

"ఏది ఏమయినా ఈ విషయం తమకు నివేదించడం నా ధర్మం! ఆ పైన తమ చిత్తం!"

అని ఇంకా అలాగే దోసిలికట్టి నిలుచున్నాడు మంత్రి. కాని మహారాజా విషయం అంతటితో తుంచివేసి మంత్రితో ఇష్టాగోష్ఠి ప్రారంభించాడు.

దానితో మంత్రికి కొండంతభారం గుండెలమీదినించి దింపివేసినట్లయింది. వెంటనే అతడొక్క నిట్టూర్పు విడిచిపెట్టాడు. మహారాజా దగ్గర సెలవుతీసుకుని తన భవంతికి తిరిగి వెళ్ళిపోయాడు.

భవంతికి తిరిగి రాగానే శ్రీనగర దండదండనాథుడు దర్శనంకోసం చాలాసేపటినించి వేచి ఉన్నాడని ఒక పరిచారకుడు విన్నవించాడు. వెంటనే మంత్రి మంత్రాగారంలోకి వెళ్ళిపోయాడు. శ్రీనగర దండనాథు డక్కడ దీనంగా చేతులు కట్టుకుని నిలబడ్డాడు. మంత్రి అతన్ని చూస్తూనే ప్రశ్నించాడు: "ఏమి! ఏమైంది? ఆ రత్నాంగుళీయకం దొరికిందా?"

"లేదు!"

"లేదా! ఇన్నాళ్లనించీ మీరంతా ఏమి చేస్తూన్నట్టు? మహాశివరాత్రిలోగా మీరా ఉంగరం పట్టుకుని తీరాలి! అంతవరకు మీరిక నాకంటపడవద్దు! మహాశివరాత్రికి మహారాజు స్వయంగా భూతేశ్వరస్వామికి పూజాఅభిషేకాలు చెయ్యబోతున్నారు! తెలిసిందా?"

ఆ గర్జన విని దండనాయకుడు తలవంచుకొన్నాడు:

"ఎంతప్రయత్నించినా మా కవి లభ్యం కాలేదు!"

"నాకది అంతా తెలియదు! మహాశివరాత్రిలోగా మీరా ఉంగరం పట్టుకుని తీరాలి!"

అని మంత్రి తటాలున లేచి తన అభ్యంతర మందిరంలోనికి వెళ్లిపోయాడు.


## ౬

అటుపిమ్మట రెండుమూడురోజులదాకా మంత్రి పరమేశ్వర పాదధ్యానంలో నిమగ్నుడైనాడు. క్రమక్రమంగా అతని హృదయంలో వారణాసికి వెళ్ళిపోవాలనే కాంక్ష ఇనుమడించింది. ఆ మరునాడే ఆమహారాజును దర్శించి తన కోరిక తెలుపుదు చేసుకున్నాడు. క్రమక్రమంగా తన శరీరపాటవం తగ్గిపోతున్నదనీ, కుమారుని మూలకంగా మన స్తిమితం తప్పిందనీ తన విజ్ఞప్తి మన్నించవలసిందనీ ప్రార్థించాడు. కాని అవంతివర్మ ఆ మాట బొత్తిగా వినిపించుకోలేదు:

"నేను నామకః కాశ్మీరాధిపతిని. మీరు నాకు పితృసమానులుగానిలిచి ఇన్నాళ్లనించీ ఈ రాజ్య సంరక్షణభారం వహించారు. అందుచేత ఈ విషయం నిర్ణయించవలిసినవారు మీరే! ఒకవేళ మీరుకాదు, కూడదని



SISTA'S · AML · 32 TEL





తెల్లని బట్టలు ప్రకాశించేలా తెల్లబడేటట్లు చేయాలంటే, దానికి సరియైన మార్గం "టినోపాల్", కొద్దిగా టినోపాల్, ఒక్కసారి ఉపయోగించితే మూడు నాలుగు ఉతుకులవరకూ చాలుతుంది.

టినోపాల్ ఉపయోగించిన తెల్లని బట్టలు అన్నిటికన్నా తెల్లనైనవి.

**టినోపాల్**

"టినోపాల్" జె.ఆర్. గాయిగి యస్. ఏ. బాల్, స్విట్జర్లాండ్ వారి ట్రేడ్‌మార్కు.

అమాల్గమేటెడ్ కెమికల్సు అండ్ డైస్టఫ్సు కంపెనీ, ప్రైవేట్ లి., పోస్ట్ బాక్సు 965 – బొంబాయి.



# పరమశివార్పణ

వారణాసికి వెళ్ళదలిచిన పక్షంలో మీవంటి ధర్మమూర్తి నెవరినైనా ఇంకొకరిని మీ ధర్మాసనంమీద కూర్చోబెట్టి మరీ వెళ్ళండి! అంతే నా కోరిక!"

అని కిలకిల నవ్వాడు. మంత్రికేమీ అనడానికి పాలుపోక మధ్యాహ్నం పూజా వేళకు మళ్ళీ తన భవంతికి తిరిగి వచ్చి వేశాడు. వెంటనే పరమేశ్వర పాదపూజలో పడి బాహ్య ప్రపంచమే మరిచిపోయాడు. పూజా పునస్కారాలన్నీ ముగించుకొని భోజనంచేసి కొంచెంసేపు విశ్రమించడం మంత్రికొక అలవాటు. ఆనాడుకూడా అతడలాగే తన రహస్య మంత్రాగారంలో కొంచెంసేపు విశ్రమించాడు.

అంతలోనే శ్రీనగర దండనాథు డతని సందర్శనానికి వచ్చాడు. మంత్రి తొందరగా లేచి ఎంతో ఆత్రంగా అతన్ని రహస్య మంత్రాగారంలోని కాహ్వానించాడు.

దండనాథుడు మంత్రితో కలిసి ఒక అరగడియసేపు మాత్రమే సంప్రతింపులు జరిపాడు. వెంటనే తిరిగి వెళ్ళిపోయాడు.

పినాకధన్వ ఇన్నాళ్లనించీ తండ్రి భవంతిలో అంటీ అంటనట్టు కాలక్షేపంచేస్తూ తల్లి తండ్రులకెంతో అనువర్తనగా ఉన్నట్టు నటిస్తున్నాడు.

దండనాథుని రాకపోకలతో అతనికేదో అనుమానం వేసింది. కాని వారిరువురి మధ్య ఏమి నడిచిందో అతనికి తెలియలేదు. అంతలో కూరమంత్రి అతన్ని గట్టిగా గొంతెత్తి పిలిచాడు. ధన్వ ఎంతసేపటికీ తన దగ్గిరికి రాకపోతే అతడే అతనిదగ్గిరికి వెళ్ళి ఒక సుఖాసనంమీద కూర్చున్నాడు.

పినాకధన్వ కతనిముఖవైఖరి చూడగానే పై ప్రాణాలు పైనే ఎగిరిపోయాయి. మంత్రి రూక్షంగా కుమారునివైపు చూచాడు:

"అమ్మవారి అంగుళీయకంనీ వేమిచేశావు! నిజం చెప్పు!"

"నాకు దానివిషయమేమీ తెలియదే!"

"నీకు తెలుసును! అబద్ధాలాడకు! ఇప్పటికైనా నిజంచెబితే నీ ప్రాణాలు నిలుస్తాయి! నామాట విను."

పినాకధన్వ తెల్లబోయాడు. ఆ భయోద్వేగంలో అతనికేమనాలో తెలియలేదు. మళ్లీ అలాగే తనకేమీ తెలియదని సమాధానం చెప్పాడు. అది వినగానే మంత్రి ముఖం అగ్నిజ్వాలలా జేవురించింది. తన పక్కనే దంతపేటికలో దాచిన అమ్మవారి రత్నాంగుళీయం పైకెత్తి పట్టుకున్నాడు:

(54-వ పేజీ చూడండి)

# సినిమా వార్తలు

భారతీ ప్రొడక్షన్స్‌వారి "బభ్రువాహన" చిత్రానికి విజయ పిక్చర్స్ అధిపతి శ్రీ బి. నాగిరెడ్డి వాహినీలో ఏప్రిల్ 7 వ ప్రారంభోత్సవం చేశారు. శ్రీయుతులు వేదాంతం రాఘవయ్య, నాగయ్య, సి. ఎస్. ఆర్. ఎ. నాగేశ్వరరావు, ఆర్. నాగేశ్వరరావు, ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభృతులు వచ్చారు.

శ్రీ ఎన్. టి. రామారావు క్లాప్ కొట్టారు. తొలి 'షాట్' లో శ్రీమతి రాజసులోచన నృత్యాన్ని చిత్రించారు. శ్రీ సముద్రాల రాఘవాచార్య ఈ చిత్రానికి దర్శకత్వం నిర్వహిస్తున్నారు. నిర్మాతలు శ్రీ కేసర్ల రామసామయ్య శెట్టి, ఎ. వి. రమణమూర్తి.

* * *

అశ్వరాజ్ పిక్చర్స్ వారి "వినాయక చవితి" విడుదలకు సిద్ధంకావస్తున్నది. రచయిత సముద్రాల రాఘవాచారి, ఈచిత్రానికి దర్శకత్వం నిర్వహించారు. జమున, గుమ్మడి వెంకటేశ్వరరావు మొదలగువారు పాల్గొన్నారు.

* * *

నిర్మాణం పూర్తికావస్తున్న మరో చిత్రం అశోక పిక్చర్స్ వారి "భూలోక రంభ". ఇది తెలుగు తమిళ భాషలలో తయారవుతోంది. అంజలి ఇందులో ముఖ్యభూమిక నిర్వహిస్తున్నది. ఇతరనటులు చలం, రేలంగి, ఆర్. నాగేశ్వరరావు. రచన సముద్రాల జూనియర్. దర్శకుడు ఎస్. బాలచందర్.

* * *

విశాల్ ప్రొడక్షన్స్‌వారి "వద్దంటే పెళ్ళి" వాహినీలో చురుకుగా తయారవుతోంది. మేనెలలో విడుదలకై దర్శకుడు విశాలాచార్య సన్నాహాలు చేస్తున్నారు. కృష్ణకుమారి, గిరిజ, అమర్‌నాథ్, రాజనాల, సి. ఎస్. ఆర్, రమణారెడ్డి పాల్గొంటున్నారు.

## 'తోడికోడళ్లు'

ఆంధ్రలో విజయవంతంగా సాగుతున్న అన్నపూర్ణావారి సాంఘికచిత్రం "తోడికోడళ్లు" కథను, మాటలూ పాటలతో జోడించి చక్కని పుస్తకంగా వేశారు. ఆత్రేయ, ఆదుర్తి సుబ్బారావు, డి. మధుసూధనరావు, శరత్ కథ "నిష్కృతి"ఆధారంగా ఈ చిత్రకథను వ్రాయడం విదితమే. ఇపుడు రామ్‌చంద్ దాన్ని కొంత సంగ్రహంగా రూపొందించి ఇందులో పొందుపరచారు. "తోడికోడళ్లు" చిత్రంలోని ఛాయాచిత్రాలు చాలా వేశారు.

వెల 6 అణాలు (37 న యా పైసలు). ప్రచురణ డి. మధుసూధనరావు. అన్నపూర్ణాపిక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ మద్రాసు. ప్రతులకు విశాలాంధ్ర ప్రచురణాలయం పేరిట, బకింగ్‌హాంపేట, విజయవాడ-2 కు వ్రాయాలి.

## కళాకారులకు పరిషత్సన్మానం

సంగీతనాటక అకాడమీవారు 1956 వ సంవత్సరానికి ఈ క్రింది కళాకారులను సత్కరించారు. చలనచిత్ర దర్శకుడు శ్రీ దేవకీ బోస్; రచయిత శ్రీ జి. డి. మద్గూల్‌కర్.

భరతనాట్యం: శ్రీమతి రుక్మిణీ అరుండేల్ కథక్ శ్రీ లచ్చు మహరాజ్.

కర్ణాటక సంగీతం శ్రీ ముసిరి సుబ్రహ్మణ్య అయ్యర్, వయొలిన్– శ్రీ మైసూర్ చౌడయ్య. హిందుస్థానీ సంగీతం శ్రీమతి రసూలన్ బాయ్.

రాష్ట్రపతి డా॥ రాజేంద్రప్రసాద్ మార్చి 31 న వీరికి సమ్మానపత్రాలిచ్చి గౌరవించారు. శ్రీ దేవకీబోస్ అస్వస్థులుగా ఉన్నందువల్ల ఆరోజు ఉత్సవంలో పాల్గొనలేకపోయారు.

## హాస్య నటుడు గోప్ మృతి

150 పైచిలుకు చిత్రాలలో హాస్యభూమికలు నిర్వహించి, పేరు, ప్రేక్షకుల అభిమానమూ గడించుకొన్న హిందీనటుడు గోప్ గతవారం గుండెజబ్బువల్ల హఠాన్మరణం చెందారు. లైఫ్ అండ్ ఆర్ట్స్ వారి "తీస్రీ గలీ" అనే చిత్రంలో నటిస్తూ ఉండగా మరణం సంభవించింది. గోప్ వయసు 44 సంవత్సరాలు. ★



ఆర్. కె. ఫిలింస్ వారి "అబ్ దిల్లీ దూర్ నహీ" లో సులోచన, మోతీలాల్.

# పరమశివార్చన

(10-వ పేజీ తరువాయి)

"ఇదిగో ఆ అంగుళీయకం! నీవు చేసినదంతా నాకు బోధపడిపోయింది. ఇప్పటికైనా నిజం చెప్పు!"

ధన్వముఖంలో కత్తివాటువేసినా నెత్తురు చుక్కలేదు! అతడు మరి చేసేదేమీ లేక తానన్నమాటేమళ్లీ వంతపాడాడు. దానితో మంత్రి అగ్గిలో వేసిన గుగ్గిలంలా మండిపడ్డాడు!

"ధన్వా! నీవీ అంగుళీయకం అనంగలేఖకు బహూకరించావు! అమ్మవారి వ్రేలినున్న ఆ అంగుళీయకం అవారకాంతవ్రేలి కలంకరించావు! ఇది అంతా ఋజువయిపోయింది. ఇప్పటికయినా నిజం చెప్పు! నాయనా! నా మాట విని నీ ప్రాణాలు సంరక్షించుకో!"

ధన్వ తలవంచుకొన్నాడు. అంతేగాని అవునని గాని కాదని గాని సమాధానం చెప్పలేదు. ఆ మౌనంతో మంత్రి తన ఆగ్రహానికి కట్టుకొన్న అడ్డుకట్ట ఒక్కమారుగా పటాపంచలైపోయింది!

"ఛీ నీచుడా! నీవిక నా భవంతిలో ఉండ డానికి తగవు! వెంటనే ఇక్కడనుంచి వెళ్ళిపో! ఈ నాటినించీ నీకు, నాకు ఋణం తీరిపోయింది. ఇక నీవు నాకు కుమారుడవు కావు! నేను నీకు తండ్రిని కాను. పో! నా ఇంటిలోనించి లేచిపో!"

అయినా ధన్వ ఇంకా అలాగే నిలబడ్డాడు. మంత్రి మళ్ళీ విరుచుకుపడ్డాడు:

"ఏం! ఎన్ని సారులు చెప్పినా కదలవేం! పో! నాఇంట్లోనించి లేచిపో! లేకపోతే నేనే నిన్ను మెడపట్టుకుని గెంటివేస్తాను! తెలిసిందా! పో! ఇక నా ఎదుట నిలబడకు!"

మంత్రి లేవబోయాడుగాని అతనికి కొంచెం సమీపంలో నిలబడిన మంత్రి పరిచారకుడు ధన్వను నెమ్మదిగా వీధిలోకి గెంటివేశాడు.

అంతలో ఆ గందరగోళం అంతా విన్న జయమంగళ హడిలిపోతూ అక్కడికి పరిగెత్తుకు వచ్చింది. ఒక్కక్షణంలో ఏదో విడ్డూరం జరిగిందని గ్రహించుకుంది:

"ఏమి జరిగింది! ఏమిటిదంతా!"

ఎంతో ఆత్రంగా ప్రశ్నించింది. మంత్రి ఒక్క దీర్ఘనిశ్వాసం విడిచిపెట్టాడు:

"ఇదిగో! నీ కుమారుడు చేసిన ఘనకార్యమిదిగో!"

ఆ అంగుళీకం ఆమెకు చూపించి జరిగినదంతా సంగ్రహంగా ఆమెకు తెలియజేశాడు. జయమంగళ అతని పాదాలమీద పడి ఆ తప్పిదమెలాగైనా మన్నించి ధన్వంతరిని ఇంట్లో ఉండనీయవలసిందని పరిపరివిధాల ప్రార్థించింది. మంత్రి నెమ్మదిగా ఆమెనోదార్చడానికి ప్రయత్నించాడు:

"ధన్వ నెలాగైనా సంరక్షించాలనే నేననేకవిధాల బతిమాలుకున్నాను. కాని వాడు నామాట వినిపించుకోలేదు! నే నేమి చెయ్యగలను! ఈ క్షణంనించీ ఇక వాడు నా కుమారుడు కాదు. అంతే!"

అయినా జయమంగళ అతని పాదాలు విడిచిపెట్టలేదు! అల్లాగే కాళ్ళమీదపడి పరిపరివిధాల బతిమాలుకుంది. కాని మంత్రి చలించలేదు:

"ఇక ఈ క్షణంనించీ ధన్వ నాభవంతిలో అడుగు పెట్టడానికి వీల్లేదు! నీవు నీకుమారుణ్ణి విడిచి ఉండలేకపోతే నీవుకూడా వాడితో కలిసి వెళ్ళిపో! అంతేగాని వాడిక యీ భవంతిలో అడుగుపెట్టడానికి వీలులేదు! అంతే!"

మంత్రి వెంటనే ఆమె పాదాలపట్టు విదిలించుకొని ఒక్క అంగలో అక్కడినించి వెళ్ళిపోయాడు. జయమంగళ అక్కడే కూలబడిపోయింది. —సశేషం.

# వేలంపాట

(12-వ పేజీ తరువాయి)

"దేఖో సాబ్! మళ్ళీ ధర పలకలేదు కనుక అందరికీ కమీషన్ ఇస్తున్నాను" అంటూ మా అందరికీ తలొక పెన్సిలూ ఇచ్చాడు. పెన్సిలు బాగానే వుంది. ఎంత లేదన్నా బేడకు తక్కువ వుండదు.

మళ్ళీ ఏదో నెక్లెసు బయటకు తీశాడు. "చూడండిసార్! ఈ నెక్లెసు బజారులో కొంటే పది రూపాయలకు తక్కువవుండదు. రోల్డుగోల్డు" అంటున్నాడు.

ఎవరూ అది వినే పరిస్థితిలో లేరు. అంతా తమకు పూరికే కమీషన్ క్రింద వచ్చిన సామానులు చూసుకుంటున్నారు.

పాట మొదలుపెట్టారు. సర్దార్జీ అందుకున్నాడు "ఈసారి కమీషన్ క్రింద ఈ కత్తెరలు యిస్తాన్" అన్నాడు అవి బయటకు తీసి చూపిస్తూ. చూడటానికి కత్తిర బాగానే వుంది. ఫరవాలేదు! మళ్ళీ అందరమూ, సంభావన పుచ్చుకున్నట్లు తలొక కత్తెర పుచ్చుకోవచ్చును, అనుకున్నాము.

పాట బాగా సాగింది. నేను పూరుకోలేక మూడుంపావలా అన్నాను. ఎవరో మూడూ ఆరణాలన్నారు. చివరికి మూడూ పద్నాలుగు అణాలదగ్గర ఆగిపోయింది. వెధవది! రెండున్నర దగ్గరనుంచి లాక్కొచ్చాడు. ఎంత పాడినా ధర పలకడంలేదు.

చివరికి సర్దార్జీకి విసుగుపుట్టి పాట ఆపేశాడు.

"చూడండి! ఈ వస్తువు 8 రూ. 14 అణాలకు పాడారు. సరే! ఈ వస్తువు ఇచ్చేస్తాను. అందరూ డబ్బు చూపించండి!" అన్నాడు.

చచ్చాముర్రా బాబూ! అనుకున్నాము. అయినా ధైర్యంచేసి డబ్బు చూపించాను. అందరిదగ్గరా సర్దార్జీ డబ్బు వసూలుచేశాడు. నేను చాలా బింకంగా వున్నాను. ఎలాగూ అందరికంటే ఎక్కువ పాడిన ఆసామికి నెక్లెసు యిచ్చేస్తాడు అనుకున్నాను.

కానీ అలా జరుగలేదు. సర్దార్జీ మా అందరివంకా వొకసారి చూశి "చూడండీ! మీరంతా నాకు డబ్బు యిచ్చేశారు. అందరికీ తలొక నెక్లెసు యిచ్చేస్తాను" అంటూ అందరికీ అవి పంచిపెట్టాడు.

సర్దార్జీ రైలుదిగి వెళ్లిపోయాడు. ఇంకేముంది! రైలులో లబొయిలూ, దిబొయిలూ! అది ఇత్తడినెక్లెసుట! ఎవరూ చూసుకోలేదు. రూపాయకుకూడా అది దండుగేనట! గంటసేపుదాకా అందరమూ దాని గురించే మాట్లాడుతూ కూర్చున్నాము. ★

# అపరబుద్ధి

(34-వ పేజీ తరువాయి)

"నేను వింటున్నాను. సందేహమక్కరలేదు, చెప్పు" అన్నాడు పాండ్య.

"డాక్టరు చంద్రశేఖర్‌ను నేనే హత్యచేశాను."

* * *

పాండ్య నిశ్చేష్టుడై నావైపు చూస్తున్నాడు. అతను తెలుసుకోవాలనుకుంటున్న ప్రతి విషయం చెప్పాను. కమలాక్షి విషయం కూడా ఆయనతో చెప్పాను. పదినిమిషాల్లో అన్ని విషయాలు చెప్పగలిగానంటే విచిత్రంగానే వుండవచ్చు. పాండ్య వెళ్ళటానికి లేచాడు.

"చూడండి," అని ఆయనను పిలిచాను.

"నాకు పని వుంది."

"పోలీసులు కమలాక్షిని కొట్టకుండా చూడండి."

"నేనుత్వరగావెళ్లాలి.తరువాతమళ్లీ వస్తాను."

"పాండ్య! మీకు కావలసిన రహస్యం విప్పి చెప్పాను. ఆమెను పోలీసులు కొట్టకుండా కాపాడాలి. ఆమెను కొడితే నిన్ను హత్య చేస్తాను! ఈ రహస్యం మీకు చెప్పటానికి ఒక్కటే కారణం. ఆమెను దెబ్బలు కొట్టకూడదని నా కోరిక! హృదయపూర్వకంగా మీరు నాకు అభయం ఇవ్వాలి."

పాండ్యవెళ్లాడు. ఈవిషయం పాండ్యతో చెప్పటంతో నా హృదయానికి కొంత శాంతి కలిగింది. నేను చేసిన పనికి సంతృప్తి చెందాను. కొంత కాలంనుంచి ఈ రహస్యం నా హృదయంలోనే దాగివుంది. నేను నిద్రించినపుడు, కలలు వచ్చినపుడు, శ్వాస పీల్చుకుంటున్నపుడుకూడా ఈ రహస్యం నా హృదయంలోనే దాగి వుంది. ఇంతవరకూ నా హృదయానికి శాంతి లేకపోయింది. నా మనస్సు కమలాక్షిమీదే లగ్నమైంది. చివరికి నేను ఎవరో ఆమె తెలుసుకున్నపుడు నాగురించి ఏమనుకుంటుందో కదా అనుకున్నాను.

మూడు గంటలకు ఆఫీసు నౌకరు మధ్యాహ్నం పత్రిక తీసుకువచ్చాడు. నేను పాండ్యతో చెప్పిన రహస్యాలు పత్రికలో వెల్లడి కాలేదు. కాని డాక్టరు చంద్రశేఖర్ మొదటి భార్య మరణించినది మొదలు నడిచిన చరిత్రను సేకరించటం దగ్గరనుంచి, నన్ను రివాల్వరుతో కాల్చిన సంఘటనవరకూ పోలీసులు తీవ్రమైన పరిశోధనలు చేస్తున్నారు. దినపత్రికలో "మహిళా లోకం" నిర్వహిస్తున్న సంపాదకురాలు కోమలంతో పరిచయం చేసుకుని, ఆమె జీవితగాథను తెలుసుకుని "మృత్యుగృహం" అనే శీర్షిక క్రింద ప్రతిరోజూ ఆ పత్రికలో ఒక కథ వ్రాస్తూంది. —ఇంకా వుంది]

# పరమ శివార్చన

గత సంచిక తరవాయి

౮

వెంటనే శూరమంత్రి అరత్నాంగుళీయకం భూతేశ్వరస్వామి ఆలయ ధర్మాధికారికి అప్పగించివేశాడు. అప్పటికా విషయంలో అతని హృదయభారం కొంతవరకు తగ్గింది.

కాని పినాకధన్వను భవంతిలోనించి వెళ్లగొట్టినప్పటినించీ జయమంగళ తిన్నగా అన్నపానాలే ముట్టడం మానేసింది. కుమారుడు వెళ్లిపోగానే మంత్రికూడా బాగా కించపడ్డాడు. జయమంగళతో ఆ విషయమే చెప్పి నెమ్మదిగా ఓదార్చాడు:

“అప్పుడైనా జరిగినదంతా ఉన్నది ఉన్నట్టుగా నాతో చెబుతాడేమోనని నయానా భయానా అనేకవిధాలుగా బుజ్జగించిచూచాను. జరిగినదంతా చెప్పిఉంటే అది మహారాజసన్నిధిని విన్నవించి ఎలాగో అలాగ ఆయన క్షమాభిక్ష వేడి ఉందును. కాని మాటిమాటికీ నన్నే మోసగిస్తే నేనేమి చెయ్యగలను? శివద్రవ్యం అపహరించినవారీమధ్యనే నా చేతుల్లో దారుణ మరణదండన లనుభవించారు! శివద్రోహిని ఇంట్లో పెట్టుకున్నానంటే నే నెలాగ శివార్చన చెయ్యగలను? లోకులేమంటారు? ఇక మహారాజును నే నేముఖం పెట్టుకుని చూడగలను! అదీగాక మా వంశీయు లెవరైనా ఇలాంటి అధర్మకృత్యాలాచరించారా? అప్పటికీ నేను ఆ శిక్ష గృహనిర్వాసనంతో సరిపెట్టాను. దీనికే లోకులు నన్నేమని ఆడిపోసుకుంటారోనని భయపడుతున్నాను.”

జయమంగళ అదంతా వినీ విననట్టు ప్రశ్నించింది:

“ఇంతకీ మన ధన్వ ఎక్కడికి వెళ్లిందీ ఏమైనా తెలిసిందా?”

“లేదు. వేగులవారందరు అతని జాడే తెలియలేదని అంటున్నారు! ఒకవేళ మిగిలిన బందిపోటు దొంగలతో కలిసి హిమవన్నగ ప్రాంతాలకు పారిపోయాడేమోనని భయపడుతున్నాను,”

“అయితే ఇక నే నీభవంతిలో ఒక్క క్షణం ఉండలేను! నన్నుకూడా మా పుట్టింటికి పంపించివెయ్యండి! ఆ ఈపైన మీ రొక్కరు ఇక్కడ ఉండి ఈ రాజ్యం అంతా ధర్మదేవత నాలుగు పాదాలతోను నడిచేటట్టుగా అతిజాగ్రత్తగా ఏలుకోండి!”

జయమంగళ మళ్లీ వలవలా ఏడ్చింది. పుట్టింటికి పోతానని పట్టుపట్టింది. మంత్రికి కూడా ఆసమయంలో ఇక అదే శరణ్యమని తోచింది. అదీగాక ఆ దుఃఖావేశంలో ఆమె అక్కడఉండేటట్టుకూడాకనబడలేదు. ఇక చేసేదేమీలేక ఆమె నామరునాడే పుట్టింటికి పంపించివేశాడు. ఇక ఆభవంతిలో మిగిలిన దతడు, రత్నవర్ధనుడు, మరికొందరు పరిచారికాపరిచారకులు మాత్రమే!

పినాకధన్వ నిర్వాసనంతో మంత్రికి తన ధర్మనిర్వహణంలో కొంతవరకు సంతృప్తి కలిగింది. కాని ఆభవంతి అంతా అతనికి కేవలం శ్మశానప్రాయంగా కనిపించింది. అయినా అతడు తన ధర్మనిర్వహణ శ్రద్ధ ఏమరలేదు! కాశ్మీర రాజ్యంలో దేవాయతనాల రక్షణకు కావలసిన గట్టికట్టు దిట్టాలన్నీ చేయించాడు. దైవద్రవ్యం అపహరించిన వారినందరినీ గాలించి గాలించి పట్టుకుని మదించిన ఏనుగుల కాళ్లకింద పడవేయించి మట్టించి వేయించాడు.

అయితే భూతేశ్వర దేవాలయ సంరక్షణే అతనికంతగా సంతృప్తికరంగా కనిపించలేదు. అది శ్రీనగరానికి కనతిదూరంలో పర్వత మధ్యంలో నిర్మించిన దేవాలయం! ఆలయ ప్రాకారం దాటి పదిఅడుగులదూరం సాగిపోతే ఆపైనకనిపించేదంతా సాంద్రారణ్యమే. ఆదేవాలయానికి సంబంధించిన మడిమాన్యాలా అరణ్యప్రాంతాని కానుకునే ఉన్నాయి. పర్వత ప్రాంతాలలో నుంచి వచ్చిన బందిపోటు దొంగలప్పుడప్పుడా ఆలయం దోచుకుపోవడం జరుగుతూనే ఉంటుంది. అయితే శూరమంత్రి ఆదొంగలలో చాలామందిని హతమార్చివేశాడు. ఇక మిగిలినవారందరూ పడలెత్తిపోయి కొండలు గుట్టలు పట్టిపోయారు.

అలాగ పది పదిహేను రోజులు గడిచిపోయినా శూరమంత్రికి మరి పినాకధన్వ జాడే తెలియలేదు. బందిపోటు దొంగలతో కలిసి అతడెక్కడో ఏపర్వత గుహాలోనో దాగిఉండవచ్చునని మంత్రి నిశ్చయించాడు. ఆపైన ఎన్ని విధాల ప్రయత్నించినా అతనికి ధన్వజాడ దొరకలేదు. పుట్టింటికి వెళ్ళిన జయమంగళ ఇంకా తిరిగి రాలేదు. క్రమక్రమంగా అతనిలో ధైర్యం సన్నగిలింది. మళ్ళీ వారణాసికి వెళ్లిపోవాలనే సంకల్పం బాగా బలపడింది. ధన్వ వెళ్లినప్పటినించీ, శివస్వామికి మంత్రి భవంతికి వచ్చి ఆయనతో కొంతకాలంపాటు ఇష్టాగోష్ఠి జరిపివెళ్ళడం ఒక పరిపాటిఅయింది. ఒకనాడుదయమే అతడు మంత్రి భవంతికి విచ్చేశాడు. మంత్రి అతనితో కొంతకాలం ఇష్టాగోష్ఠి జరిపాడు. వారిద్దరి ప్రసంగము క్రమంగా ధన్వమీదికి తిరిగింది. మంత్రి ఉసూరుమని ఒక వేడినిట్టూర్పు విడిచి పెట్టాడు:

“స్వామీ! నేనీ అమాత్యాధికారం చేపట్టి అప్పుడే ఒక పుష్కరం పైగా గడిచిపోయింది. నే నెరిగి ఉన్నంతవరకు ఎవరికీ ఏ విధమైన అపకారము చేసిఉండలేదు. నా కిటువంటి శివద్రోహి దత్తపుత్రుడుగా సంప్రాప్తించడానికి కారణమేమిటి?”

మంత్రి మళ్ళీ నిట్టూర్చాడు. శివస్వా అతని నోదార్చాడు:

“దీనిలో అంతగా ఆశ్చర్యపడవలసింది నా కేమీ కనిపించడంలేదు. పరమశివార్చన తదితర దేవతారాధనకన్న బహు దుష్కరమైనదని శివాగమశాస్త్ర వేత్తలు సెలవిస్తున్నారు! అందులోను మీరా పరమశివుని కేవలం ధర్మమూర్తిగా భావించి అనుక్షణము ఉపాసిస్తున్నారు. కనక నే మీ కిటువంటి అగ్నిపరీక్ష తటస్థించింది. భక్తుల ననుగ్రహింప దలిచినప్పుడా పరమేశ్వరుడు వారికెన్నైనా కష్టపరంపరలు కల్పిస్తూంటాడని పెద్దలంటారు. అయినా



విజ్ఞులు, మేరుధీరులు అయిన మీకు నేను వేరే విన్నవించవలసింది ఏముంది?"

మరికొంతసేపటికి వారి ప్రసంగం వారణాసి యాత్రమీదికి తిరిగింది. మహారాజెన్ని సార్లు ప్రార్థించినా తన కోరిక మన్నించడం లేదని మంత్రి ఒక నిట్టూర్పు విడిచిపెట్టాడు. శివస్వామి అందుకొన్నాడు:

"నాదొక్క మనవి! మీరు నాకిచ్చిన చనువును పురస్కరించుకుని మీతో ఒక చిన్న విషయం ముచ్చటించాలని ఉవ్విళ్లూరుతున్నాను. సెలవైతే—"

మంత్రి జిజ్ఞాసార్థకంగా, బొమముడి విరిచాడు. శివస్వామి సవినయంగా విన్నవించాడు:

"మీ ధన్వ ఆకతాయితనం బాగా పెచ్చు పెరిగినకొద్దీ మీలో ఈ యాత్రాసంకల్పం బాగా బలపడింది. అంతకు పూర్వం యీ సంకల్పం మీలో ఇంతగా బలపడలేదు."

శూరమంత్రి తల ఎత్తి శివస్వామివైపు చూచి అతని మాటలలోని అంతరార్థం నిశితంగా అర్థం చేసుకొన్నాడు. మంత్రి కతని మాటలలో కొంతవరకు యాదార్థ్యం లేకపోలేదని అనిపించింది. తక్షణమే అతని కా తరుణంలో తిరిగీ ఒక కనువిప్పు కలిగింది. తన విద్యుక్తధర్మ నిర్వహణ భీతివల్లనే, ధన్వమీది మమకారంవల్లనే తన కిటువంటి యాత్రా సంకల్పం కలిగిఉండవచ్చుననీ ఇన్నాళ్లనించీ ఆవిషయం అంతరాంతరాలలో అజ్ఞాతంగానే ఉండిపోయిందనీ మంత్రి కొంచెం గుర్తించుకొన్నాడు. కాని ఆ పరాజయం అంగీకరించడాని కత డిష్టపడలేదు:

"స్వామీ! విజ్ఞులయిన మీకు నేనేమని విన్నవించగలను! కాని నా తల్లిదండ్రులు

# ★ పరమశివార్పణ ★

నాకు 'శూరు'డని నామకరణం చేశారు. ఇంతవరకు నా జీవితంలో వారు పెట్టిన నామధేయాని కెన్నడు అపఖ్యాతి రాలేదు. నా బొందిలో ప్రాణం ఉన్నంతవరకు ఇక ముందుకూడా అటువంటి అపఖ్యాతి రానేరదు. భీరుత్వం అనేది మా ఇంటా వంటా ఎన్నడూ వినబడలేదు. ఇకముందు కూడా వినబడనేరదు!"

మంత్రి గర్జనవిని శివస్వామి కిమ్మనకుండా తాంబూల చర్వణలో పడ్డాడు. ఒక నిమిషం సేపూరుకుని నెమ్మదిగా నీళ్లు నమిలాడు:

"ఎంతమాట! మీ శూరత్వం శంకిస్తున్నానని అనుకొన్నారా? అది కాదు నేనసేది. అతడల్లారుముద్దుగా పెరిగినవాడు. కన్న మమకారం కన్న పెంచిన మమకారం పెద్దదని అంటారు.! అదీగాక ఒక కుమారుడున్నా లేనట్లే అని ధర్మవేత్తలంటారు! దానాదీనా మీమనస్సేమైనా విషమ సంధిలో పడిందేమోనని విన్నవించుకొన్నాను. అంతే!" పిమ్మట శివస్వామి మంత్రిదగ్గర సెలవు తీసుకొని తన భవంతికి మరలిపోయాడు.

౭

మరి పదిరోజులు గడిచిపోయే సరికి శ్రీనగరం అంతా రాబోయే శివరాత్రి మహోత్సవ కోలాహలంతో కలకలలాడింది. ఆనాటి కాశ్మీరంలో శివరాత్రి అబాలగోపాలానికి ఒక గొప్ప మహోత్సవం. కాశ్మీరరాజబంధువులంతా మహాశివరాత్రికి స్వయంగా శివపూజ చేస్తారు. శైవ దేవాయతనాలకు దానధర్మాలు, శైవాగమశాస్త్రవేత్తల కగ్రహార దానాలు ఇంకా ఎన్నెన్నో ధర్మకార్యాలు చేస్తారు. అవంతివర్మ స్వయంగా భూతేశ్వర స్వామికి పూజాభిషేకాలు చేసి ఆరోజంతా ఉపవసిస్తాడు. ఇక మిగిలిన శ్రీనగర పౌరులా మహోత్సవ కోలాహలంలోపడి మైమరిచిపోవడంలో ఆశ్చర్యం ఏమి ఉంది!

శ్రీనగర దండనాథుడు రాజమంత్రులిద్దరికీ భూతేశ్వరస్వామి దేవాలయ పరిసరపర్వతాలపై ప్రత్యేక స్కంధావారాలేర్పాటు చేయించాడు. ఆ స్కంధావారాలలో వారికి సమస్త సుఖవసతులు ఏర్పాటు చేయించాడు. దేవాలయార్చకులకు, రాజపురోహితులకు పూజాపునస్కారాలకు కావలసిన సంభారాలన్నీ సిద్ధం చేయించవలసిందని ఆజ్ఞాపించాడు.

మంత్రి స్వయంగా దగ్గర ఉండి ఆ ఏర్పాట్లన్నీ యథావిధిగా జరుగుతున్నదీ లేనిదీ చాలా జాగ్రత్తగా పరిశీలించాడు.

ప్రధాన పౌరులు కొంద రామహోత్సవం కళ్ళారా చూచి ఆనందించాలనే తహతహతో ఆ పరిసర ప్రాంతాలలో విడుదులేర్పాటు చేసుకొన్నారు.

అవంతివర్మ అంతఃపురాంగనలతో కలిసి భూతేశ్వరాలయానికి బయలు దేరాడు. అంతఃపురాంగనలంతా పిల్లలతోను పాపలతోను వేర్వేరు పల్యంకికలలో స్వామి ఆలయానికి ప్రయాణ మయ్యారు. పల్యంకికల కెదురుగా అవంతివర్మ పట్టపు ఏనుగు అటు ఇటు తూగుతూ ఓయ్యారంగా సాగిపోయింది. బంగారు అంబారీలో సుఖాసీనుడై చిరునవ్వులు చిందించే మహారాజును చూచి కాశ్మీర ప్రజ అబాలగోపాలము, చేతులెత్తి నమస్కరించి జయజయధ్వానాలు చేశారు!

ఆ మహోత్సవం అంతా కళ్ళారా కలయజూచిన శూరమంత్రి హృదయంలో గద్గదిక బయలుదేరింది. వేడి వేడి కన్నీరు చెక్కిళ్లపై ధారకట్టి ప్రవహించింది. గడచిన సంవత్సరం శివరాత్రి కతడు జయమంగళతోను, కుమారుడు రత్నవర్ధనునితోను కలిసి స్వయంగా స్వామికి పూజాభిషేకాలు చేశాడు. పినాకధన్వ కూడా అంటి అంటనట్టుగా పూజాభిషేకాలు నిర్వర్తించాడు.

మళ్ళీ శివరాత్రి తిరిగివచ్చే సరికతని శిరస్సుపై ఒక పెను ప్రళయం విరుచుకు పడింది. పినాకధన్వ కొండలు, గుట్టలు పట్టిపోయాడు. భార్య జయమంగళ ధన్వలేని భవంతిలో ఉండలేనని పుట్టింటికి వెళ్ళిపోయింది.

రత్నవర్ధను డొక్కడే ఆ మహోత్సవం చూడాలని అతని వెంట వచ్చాడు.

"పరమేశ్వరుని కీశివరాత్రికి నా మీద పూర్తిగా అనుగ్రహం తప్పింది. లేకపోతే నా మీద ఇన్ని ఆపద లొక్కుమ్మడిగా ఎందుకు విరుచుకు పడతాయి?"

శూరమంత్రి ఊసూరుమని వేడి నిట్టూర్పు విడిచిపెట్టాడు. దూరదూరంగా ఉత్తరదిశలో అతనికి కెదురుగా హిమవన్నగ శిఖరా లసంఖ్యాకమైన స్ఫటిక లింగ స్వరూపాలతో ప్రత్యక్షమైనాయి.

ప్రాతఃకాల సూర్యకిరణా లాశిఖరాలపై దేవకాంచన పుష్పవృష్టి కురిపించాయి. ఇంకా బాగా విడివడని మంచు తెరలలో శ్రీనగర ప్రాసాద శిఖరాలు, శివవిష్ణుదేవాలయాల సువర్ణ కలశాలు మానస సరోవరంలో అప్పుడప్పుడే వికసించే పసిడి తమ్మిపూల తీరులలో కనులకు మిరుమిట్లు కలిగించాయి. భూతేశ్వరస్వామి దేవాలయంలో వేయి బంగారుఘంట లొక్కుమ్మడిగా ఓంకార నాదా లారంభించాయి. శంఖ మిన్నందుకొన్నాయి. మంగళ తు చెవులు చిల్లులు పడేటట్టు ఘోరమని మోగాయి.

ఆ ధ్వనులలో మధ్య మధ్యన పురోహి నమక చమక పారాయణాలు, వేదమ పాఠాలు వీనులకింపుగా వినిపించాయి.

ఆ మంగళ పాఠా లాలకించిన మంత్రి మహారాజప్పుడే శివపూజ కుపక్రమించారని అనుకొన్నాడు.

కొంచెందూరంలో విడిదిచేసిన రాజసైన్య స్కంధావారాలలోనుండి హయహేష గజబృంహితాలు గంభీరంగా వినిపించాయి.

మంత్రి తన స్కంధావారంలోనికి వెళ్ళి ఆ మహోత్సవపు ఏర్పాట్లన్నీ అతి జాగరూకతతో పరిశీలిస్తూ వేయికళ్లతో కనిపెట్టి చూస్తున్నాడు.

అంతలో హఠాత్తుగా భూతేశ్వరాలయంలో మంగళ తూర్యధ్వను లొక్కుమారుగా నిలిచిపోయాయి.

వెనువెంటనే రాజపురోహితుల వేదమంత్ర పారాయణలుకూడా స్తంభించి పోయాయి. స్వామి దేవాలయంలో గర్భగుడి, ఆ పరిసరాలు అన్నీ ఒక్కుమారు గొంతు నొక్కివేసినట్టుగా నీరవమూర్తులై నిలిచాయి.

ఆ విడ్డూరానికి కారణమేమో శూరమంత్రికి తెలియలేదు. క్రమక్రమంగా అతని హృదయంలో అలజడి ప్రారంభమయింది. అంతలోనే శ్రీనగర దండనాథు డక్కడికి వచ్చి సవినయంగా మంత్రికి నమస్కరించాడు.

మంత్రి కంగారుపడుతూ క్షణకాలం అతని ముఖవైఖరి పరిశీలించాడు. దండనాథునికి మాటలు తడబడ్డాయి:

"మహారాజా తమపూజాభిషేకాలు పూర్తి కాకుండానే మధ్యలోనే తమ స్కంధావారంలోనికి వెళ్ళిపోయారు!"

"కారణం?"

"ఏమో గాని విపరీతమైన శిరోవేదనతో బాధపడుతున్నామని అన్నారు. అంతే!"

"అసలు కారణం?"

"ఏమని విన్నవించుకోను! తీరా మహారాజు పూజ కుపక్రమించేసరికి అక్కడ స్వామి సువర్ణకళశాలుగాని, రత్నహారాలుగాని చివరికి నైవేద్యం పెట్టడాని కొక ద్రాక్షఫలం గాని కనిపించలేదట?"

"అవన్నీ ఏమైపోయాయి?"

"నిన్న అపరాత్రివేళ బందిపోటు దొంగ లెవరో లోపల ప్రవేశించి అవన్నీ అపహరించుకుపోయారట!"

మంత్రి తాను వింటున్నానా, కలగంటున్నానా అని నిర్ఘాంతపోయాడు:

"అయితే మీ రంతా ఇక్కడ ఉండి

ఏమి చేస్తున్నట్టు?" ఒళ్లెరగని క్రోధావేశంతో గట్టిగా గర్జించాడు మంత్రి.

"మేమంతా ఈ ఉదయానికే ఇక్కడికి చేరుకున్నాము. జరిగినదంతా గత రాత్రే జరిగిపోయింది."

"మరి ఆ పూజారులు, రాజపురోహితులు ఏమి చేస్తున్నట్టు?"

"వారందరు తెల్లవారిన పిమ్మటే అంతటిఘోరం జరిగిందని తెలుసుకున్నారు?"

"అయితే వెనువెంటనే నాకీ విషయం ఎందుకు తెలియజేయలేదు?"

మంత్రి కళ్ళమ్మట నిప్పులు రాలాయి.

దండనాయకుని నోట మాట పెగలలేదు. నెమ్మదిగా వినబడీ వినబడనట్లుగా నీళ్లు నమిలాడు:

"అంత వివరంగా తమతో విన్నవించుకోవడానికి వ్యవధి ఎక్కడిది! రాజపురోహితులు పూజారులు గర్భాలయంలో ప్రవేశిస్తూనే అంతటి ఘోరం జరిగిందని తెలుసుకున్నారు! అంతలోనే మహారాజు పూజార్థమై గర్భాలయంలో ప్రవేశించారు. పూజారుల ముఖభంగిమలనుబట్టి ఆయన జరిగినదంతా ఒక్క క్షణంలో అర్థం చేసుకుని శిరోవేదనతో బాధపడుతున్నానని చెప్పి వెంటనే తమ స్కంధావారంలోకి వెళ్ళిపోయారు".

శూరమంత్రి కప్పటికి జరిగినదంతా కొంత వరకు తెలిసింది. అయితే తా నేర్పాటుచేసిన దేవాలయ రక్షకు లేమై పోయారో అతనికి తెలియ లేదు. మళ్ళి దండనాథునిమీద మండిపడ్డాడు:

"మీ కిలాంటివన్నీ చెయ్యి దాటిపోతేగాని నా చెవినివెయ్యరు! మరి దేవాలయ రక్షణ కేర్పాటుచేసినవారంతా ఏమైపోయారు! ఎక్కడైనా హాయిగా పడుకుని నిద్రపోతున్నారా?"

"వారి నందరినీ బందిపోటు దొంగ లంతకు ముందే హతమార్చి వేశారట!"

ఆ ప్రత్యుత్తరం విని మంత్రి దండనాథుని మీదిమీదికివెళ్ళి విరుచుకు పడ్డాడు:

"ఇంత జరిగినా మీరంతా నిమ్మకు నీరెత్తినట్టిక్కడ ఈ ఉత్సవ కోలాహలంలోపడి వినోదిస్తున్నారా? వెంటనే ఆ బందిపోటు దొంగలను పట్టుకుని, ఆ తరవాతే ఇక్కడికి రావాలని మీ కెందుకు తోచలేదు?"

"తమ ఆజ్ఞకోసమే నే నిక్కడికి వచ్చాను. తమ ఆజ్ఞే ఇక తరవాయి."

"చాలెండి! మీసాకులు మీ రూను! వెంటనే మీరందరు సైన్యాలతో కదిలిపోయి మధ్యాహ్నంలోగా ఆ దొంగల నందరినీ బంధించి ఇక్కడికి తీసుకురావాలి! అంతవరకు మహారాజు మరి పూజా పునస్కారాలారంభించరు! తెలిసిందా? త్వరగా కదిలి వెళ్ళండి!"

దండనాయకు డక్కడినించి కదిలి వెళ్ళగానే శూరమంత్రి కొక గడియ సేపటివరకు ఇంకా ఆలోచనే తోచలేదు.

"ఎంతటి ఘోరం జరిగింపోయింది! ఎంతటి ఘోరం జరిగిపోయింది! ఇది ఏదో దారుణ దైవదుర్విపాకమే!" అనుకొని తొందరగా అడుగులు వేసుకుంటూ మంత్రి తాను విడిది చేసిన స్కంధావారంలోకి వెళ్లాడు. అతనికా వేళ మహారాజు దర్శనం చెయ్యడానికే మనస్కరించలేదు! అతని జీవితంలో అటువంటి మహోత్సవ సమయంలో అంతటి ఘోరమెన్నడు జరగలేదు! కాని ఆ విషమసంధిలో అతనికి మహారాజ దర్శనం చెయ్యకతప్పలేదు. కనక ముందుగా ఆ బందిపోటు దొంగల వ్యవహారం పూర్తిగా తేలే దాకా మహారాజదర్శనమే చెయ్యదలుచుకోలేదు.

౬

అటుపిమ్మట శూరమంత్రి మిట్టమధ్యాహ్నం వేళ మహారాజదర్శనానికి బయలుదేరి వెళ్లాడు. అవంతివర్మ అంతవరకు తన స్కంధావారంలో హంసతూలికా తల్పం మీదనే విశ్రమించిఉన్నాడు. మంత్రిని చూడగానే నెమ్మదిగా లేచికూర్చున్నాడు.

"తమ శిరోవేదన ఎలాగున్నది?" అన్నాడు మంత్రి చేతులు జోడించి.

"కొంచెం తగ్గింది. క్రమక్రమంగా తగ్గిపోవచ్చును."

అవంతివర్మ ఊరూరుకుని నిట్టూర్చాడు. అంతేగాని దేవాలయ చౌర్యాన్ని గురించిగాని మరి ఇంకేవిషయాన్ని గురించిగాని మంత్రితో ప్రస్తావించనేలేదు. మహారాజు మౌనం శూరమంత్రిని మరింత వేధించింది.

అవంతివర్మ కింతవరకు మంత్రి రాజ్యకార్య నిర్వహణాన్నిగూర్చి ప్రశ్నించవలసిన అవసరమేకలగలేదు. ఆ మహాశివరాత్రినాడు మాత్రం అవంతివర్మ కటువంటి అవసరం కలిగింది. కాని అతడు శూరమంత్రి యెడల తనకున్న గౌరవంకొద్దీ, సౌహార్దంకొద్దీ ఆ విషయమే ఎత్తుకోలేదు. కనకనే ఆ విషయం మంత్రి నంతగా మథనపెట్టింది. మహారాజు శిరోవేదనకు కారణంకూడా అదేనని శూరమంత్రి అంతకుపూర్వమే అర్థం చేసుకొన్నాడు. మహారాజు మౌనం చవిచూచిన మంత్రి ఒకటి రెండు నిమిషాల వరకు అలాగే చేతులు జోడించి నిలుచున్నాడు. పిమ్మట నెమ్మదిగా విన్నవించాడు:

"మహారాజా! నా అశక్తతమూలంగా తమ మహాశివరాత్రి వ్రతానికొక పెద్ద అంతరాయమే ఏర్పడింది. ఇప్పుడిక ఆ అంతరాయం అంతా పూర్తిగా తొలిగిపోయింది. తమ రిక పూజాభిషేకాలకు ఉపక్రమించవచ్చును! నా బొందిలో ప్రాణం ఉండగా ఇక ఇటువంటి అంతరాయం ఎన్నడూ

(54-వ పేజీ చూడండి)



# పరమశివార్చన

(28-వ పేజీ తరువాయి)

రాదు! వేళ దాటిపోకుండా తిరిగి పూజాభిషేకాల నుపక్రమించండి!"

అవంతివర్మకు మంత్రిమాట లెంతో ఆశ్చర్యం కలిగించాయి. ఆశ్చర్యం పట్టలేక అడిగాడు :

"ఆ బందిపోటు దొంగలనందరినీ అప్పుడే బంధించివెయ్యడం జరిగిందా?"

"ఆఁ. జరిగిపోయింది! నేను బ్రతికి ఉన్నంతకాలము తమ ధర్మశాసనం కాశ్మీరంలో అంతటా అప్రతిహతంగా సాగిపోవాలిసిందే!"

మహారాజు మరింత ఆశ్చర్యపడ్డాడు. మంత్రితో కలిసి భూతేశ్వర దేవాలయంలో ప్రవేశించి తిరిగి శివపూజాభిషేకాలకు సంకల్పం ప్రారంభించాడు.

పూజకు కావలిసిన సంభారాలన్నీ మంత్రి అంతకుపూర్వమే సిద్ధం చేయించాడు. అంత శీఘ్రంగా బందిపోటు దొంగలను బంధించిన మంత్రి శక్తిసామర్థ్యాలు తెలుసుకొని మహారాజు కొంతసేపటివరకు అలాగే నిర్ఘాంతపోయాడు. ఆపైన అక్కడ అమర్చిన శివపూజా సంభారాలు, పూజా ద్రవ్యాలు చూచి మరింత సంతోషించాడు.

పిమ్మట తిరిగీ యథావిధిగా శివార్చన ప్రారంభమైనది. మంత్రి ఒక్క క్షణంవరకు అక్కడే నిలబడ్డాడు. తరవాత కొంచెం అత్యవసర వ్యవహారమేదో ఉన్నదని చెప్పి తిరిగి తన స్కంధావారానికి వెళ్ళిపోయాడు. అవంతివర్మ యథావిధిగా భూతేశ్వరస్వామి పూజాభిషేకాలు ముగించుకొని సెమ్మదిగా అడుగులు వేస్తూ తిరిగి తన స్కంధావారానికి బయలుదేరాడు. మార్గంలో అతని కొక భీభత్సం కనిపించింది. అదిచూచి మహారాజు నోటమాటలేక అలాగే నిలబడిపోయాడు.

భూతేశ్వరాలయానికి ఒక పార్శ్వంలో అమ్మవారి ఆలయము, మరి ఒక పార్శ్వంలో భైరవాలయము ఉన్నాయి.

మహారాజు భైరవాలయం ముందునించే తన స్కంధావారంవైపు సాగిపోతున్నాడు. వెడుతూవెడుతూ స్వామి కొకమారు సవినయంగా చేతులుజోడించి నమస్కరించాడు.

భైరవస్వామి కెదురుగా అమర్చిన బలిపీఠంపై అతనికొక మానవశిరస్సు కనబడింది. అది అప్పుడే ఖండించిన శిరస్సు! కంఠనాళాలలోనించి రక్తధారలింకా సన్నసన్నగా ప్రవహిస్తూనే ఉన్నాయి. మహారాజా ముఖంవైపు పోకమారు పరిశీలనగా చూశాడు. అయినా అతని సందేహం తీరలేదు.

ప్రక్కనే చేతులు జోడించి వెంట వెంట నడిచివస్తున్న ఒక రాజ పురోహితునివైపు చూచాడు:

"అది ఎవరు?"

"మహామంత్రి దత్తకుమారులు ధన్య మహాప్రభూ!"

మహారాజొక్క క్షణంవరకు మాటలాడలేకపోయాడు. వెంటనే ఎంతో ఆత్రంగా ప్రశ్నించాడు:

"ఇతని కీశిక్ష ఎవరు విధించారు?"

"మహామాత్యులు శూరమంత్రి."

"కారణం?"

"అతడు బందిపోటు దొంగలతో కలిసి నిన్న రాత్రి వేళ భూతేశ్వరాలయంలో అమ్మవారి స్వర్ణకలశాలు, హారాలు అన్నీ అపహరించాడు. ఈ వేళ మీ పూజకు పూర్వమే దండనాథు డతన్ని బందిపోటు దొంగలతో సహా బంధించి ఇక్కడకు తీసుకు వచ్చాడు."

అవంతివర్మ కా క్షణంలో అదంతా బోధపడిపోయింది. పిసాకథ నేవ్వ ఆబందిపోటు దొంగలతో కలసి గత రాత్రివేళ భూతేశ్వరాలయంలో దొంగతనాని కొడిగట్టాడని దత్తపుత్రుడని అయినా ఆలోచించకుండా మంత్రి వెంటనే అతనికా దారుణ మరణశిక్ష విధించాడనీ గ్రహించుకొన్నాడు.

ఆ క్షణంలో అతనికి శూరమంత్రి ఆకృతి సాక్షాత్తు భూతేశ్వరస్వామి మూర్తిగానే స్ఫురించింది. హృదయంలోనే అతనికి చేతులు జోడించి నమస్కరించాడు. వెంటనే మంత్రి భవంతికివెళ్ళి ఆయనదర్శన భాగ్యం పొంది మహాశివరాత్రి సాఫల్యం పొందవలెనని అనుకున్నాడు. మున్ముందుగా భూర్జపత్రంపై స్వహస్తాలతో మంత్రిపేర ఒక లేఖ రచించాడు. లేఖ ముగించి అది మనస్సులో ఒకమారు చదువుకొన్నాడు :

"పరమమాహేశ్వరులు, కాశ్మీర మహామాత్యులు అయిన శూరవరేణ్యుల పాదపద్మ సన్నిధికి :

"తా మింతకుపూర్వం వారణాసికివెళ్ళి పరమశివార్చనలోనే తమ అంతిమ జీవితం అంతా గడిపివెయ్యాలని ఎంతైనా ఉత్సహించారు.

"నేను తాము మెట్టిన శ్రీనగరమే వారణాసి అనేభావంతో దాని కంగీకరించలేదు.

"ఇక ఇప్పటినించీ మీ కీ మహామాత్య భారం తీరిపోయింది. కాని ఇకనించీ ఈ కాశ్మీర రాజ్యానికి తామే పట్టాభిషిక్తులు! నేను మీసన్నిధి నొక అమాత్యమాత్రుడను మాత్రమే!

ధర్మమూర్తి అయిన భూతేశ్వరస్వామి అర్చనానిరతిలో నేను మీకన్న మిన్న అని అనుకొన్నాను. కాని నేటితో ఆ అహంభావం అంతా పటాపంచలై పోయింది. ఇకనించీ ఈ విషయంలోకూడా నేను కేవలం మీపాదరేణువునే!"

పిమ్మట రాజాధికారులా భూర్జపత్రలేఖపై రాజముద్రిక ముద్రించారు. ఆక్షణంలో అవంతివర్మ కవోష్ణబాష్పా లొకటిరెండా లేఖపై ముత్యాల ముద్రికలై నిలిచాయి. రాజదర్శనానికిముందే ఆ లేఖ మహామంత్రికి చేరిందని వేరే వ్రాయనక్కరలేదుగదా!

—సమాప్తం.



## నారసింహ లేహ్యము

బంగారుతో చేరినది. మేహము, నిస్త్రాణ, నిస్సత్తువ వగైరా హరించి, బలము రక్తవృద్ధి కల్గించును. 20దు, డబ్బి రు. 3-4-0. పోస్టేజి రు. 1-0-0.

పి. వి. ఏ. అండ్ కో, (ఆయుర్వేద సమాజం)
పెరదేవి (పోస్టు) — నెల్లూరుజిల్లా.

ఓం తత్ సత్    కే. టి. కృష్ణమూర్తి ఆచారిగారి

## "మేల్ మాయిల్ మందు"



ప్రపంచంలో ప్రఖ్యాతిగాంచిన మేహ, కుష్ఠురోగ నివారిణి భయంకరమైన మేహవ్యాధివల్ల కష్టపడు వారలకు పునర్జన్మమిచ్చు అద్భుత సంజీవి.

మేహరోగ నివారణ నూనె, లేహ్యం.

నల్లమేహ, ఎఱ్ఱమేహ, పొడలు మేహరణములు, తిమ్మిర్లు, మతిమాంద్యము; కుష్ఠములు, పిత్తకారితము, మూత్రవ్యాధులు, వాతము, గుల్మము, తెలుపు, ఉష్ణం, గ్రంధి, కాళ్ల చేతులుమంట, రక్తబలహీనం, గజ్జి, దురద, వీర్యనష్టం, మూలవ్యాధి, మలబద్ధంమొదలైనఅన్నివిధముల దుర్వికారవ్యాధులను పోగొట్టును. 40 రోజులు (1 మండలము) నూనె, లేహ్యం రు. 6/- తపాల్ ఖర్చులువేరు.

వివరములకు కేట్లాగులో చూడవచ్చును.

కే. టి. కృష్ణమూర్తి ఆచారి & సన్సు, 6/22, మేల్ మాయిల్ పోస్టు, (N.A.Dt.)